తెలంగాణ TELANGANA MUCHATLU
TELTEL/2023/88710
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
వరంగల్ | శుక్రవారం - 26- జూన్ 2026 | సంపుటి : 4 | సంచిక : 22 | పేజీలు - 8 | వెల : రూ 7 | www.telanganamuchatlu.in

# ప్రభుత్వ ఉద్యోగులకు బీమా రక్షణ కల్పిస్తున్నాం

సీఎం రేవంత్ రెడ్డి



## 16 బ్యాంకులతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందాలు

## ఉద్యోగుల భద్రత ప్రభుత్వ బాధ్యతేనని స్పష్టం

## రవీంద్రభారతిలో బీమా పథకానికి శ్రీకారం




హైదరాబాద్, జూన్ 25 (తెలంగాణ ముచ్చట్లు):

ప్రభుత్వ ఉద్యోగుల్లో విశ్వాసం, భద్రత పెంపొందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం బీమా రక్షణ కల్పిస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల కోసం బీమా సౌకర్యం కల్పించే కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు, ఉన్నతాధికారులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఉద్యోగులకు బీమా రక్షణ కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం వివిధ బ్యాంకులతో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకుంది. రాష్ట్ర ప్రభుత్వంతో లావాదేవీలు నిర్వహిస్తున్న 16 బ్యాంకులు ఈ కార్యక్రమంలో భాగస్వాములయ్యాయి.

ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు అడగకపోయినా వారికి భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. సింగరేణి కార్మికులకు కోటి రూపాయల బీమా కల్పించిన తరహాలోనే ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమంపై కూడా ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని తెలిపారు.

గతంలో నెల మొదటి తేదీన జీతాలు చెల్లించలేని పరిస్థితులు ఉండేవని, ప్రస్తుతం ప్రతి నెలా తొలి తేదీన జీతాలు అందిస్తున్నామని సీఎం చెప్పారు. ఉద్యోగుల పదవీ విరమణ ప్రయోజనాల చెల్లింపుల కోసం కూడా ప్రభుత్వం భారీ మొత్తంలో నిధులు విడుదల చేస్తోందని వెల్లడించారు.

మిగతా 2లో

## ఓటరు వివరాల సవరణలో అప్రమత్తంగా ఉండాలి

- అర్హులైన ఒక్క ఓటు కూడా తొలగిపోకూడదన్న మంత్రి పొన్నం
- ఎన్యూమరేషన్ ఫారాలు తప్పనిసరిగా నింపాలని సూచన
- ప్రజల్లో అవగాహన పెంచాలని అధికారులకు ఆదేశం



హైదరాబాద్, జూన్ 25 (తెలంగాణ ముచ్చట్లు):

హైదరాబాద్‌లో ఓటరు వివరాల ప్రత్యేక సవరణ ప్రక్రియ ప్రారంభమైన నేపథ్యంలో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రజలకు కీలక సూచనలు చేశారు. అర్హత ఉన్న ఒక్క ఓటు కూడా జాబితా నుంచి తొలగిపోకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఓటు హక్కు ప్రజాస్వామ్యంలో అత్యంత విలువైనదని పేర్కొన్నారు. ప్రత్యేక సవరణ ప్రక్రియలో భాగంగా ఇంటింటికీ వెళ్లే బూత్ స్థాయి అధికారులు అందించే ఎన్యూమరేషన్ ఫారాలను ప్రజలు తప్పనిసరిగా నింపి సమర్పించాలని

మిగతా 2లో

## బంజారా రిజర్వేషన్ స్వర్ణోత్సవ బస్సు యాత్ర ప్రారంభం

- గాంధీ భవన్‌లో జెండా ఊపి ప్రారంభించిన మహేష్ కుమార్ గౌడ్
- ఆదివాసీ హక్కుల పరిరక్షణకు కాంగ్రెస్ కట్టుబాటు
- పెద్దఎత్తున పాల్గొన్న ప్రజాప్రతినిధులు, నాయకులు

2లో




## వైద్య రంగంలో తెలంగాణ ఆదర్శంగా నిలుస్తోంది

- అత్యాధునిక దంత ఆసుపత్రిని ప్రారంభించిన స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్
- వైద్య వృత్తి అత్యంత పవిత్రమని వ్యాఖ్య
- వైద్య హబ్‌గా తెలంగాణ ఎదుగుతోందని అభిప్రాయం

హైదరాబాద్, జూన్ 25 (తెలంగాణ ముచ్చట్లు):

వైద్య రంగంలో తెలంగాణ దేశానికి ఆదర్శంగా నిలుస్తోందని శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పేర్కొన్నారు. శేరిలింగంపల్లిలోని నానక్‌రామ్‌గూడలో ఏర్పాటు చేసిన ఏపీ సూపర్ స్పెషాలిటీ డెంటల్ హాస్పిటల్ అండ్ ఇంప్లాంట్ సెంటర్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న వైద్య సదుపాయాలను పరిశీలించిన స్పీకర్, ఆధునిక పరికరాలు, ప్రత్యేక వైద్య సేవలపై సంతృప్తి వ్యక్తం చేశారు. రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించేలా ఆసుపత్రి యాజమాన్యం కృషి చేయాలని సూచించారు.

అనంతరం మాట్లాడుతూ వైద్య వృత్తి అత్యంత పవిత్రమైనదని, ప్రజల ఆరోగ్య సంరక్షణలో వైద్యుల పాత్ర అమూల్యమని అన్నారు. సేవాభావంతో వైద్య సేవలు అందించడం ద్వారా సమాజానికి మేలు చేయవచ్చని పేర్కొన్నారు. తెలంగాణలో వైద్య రంగం వేగంగా అభివృద్ధి చెందుతోందని స్పీకర్ తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు రంగాల భాగస్వామ్యంతో అత్యాధునిక వైద్య సదుపాయాలు అందుబాటులోకి వస్తున్నాయని చెప్పారు. దీనివల్ల ఇతర రాష్ట్రాల నుంచి కూడా ప్రజలు చికిత్స కోసం తెలంగాణకు వస్తున్నారని వివరించారు.

అధునాతన వైద్య సేవలు, నిపుణులైన వైద్యులు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం కారణంగా తెలంగాణ వైద్య హబ్‌గా ఎదుగుతోందని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రజలకు అందుబాటు ధరల్లో మెరుగైన వైద్యం అందించడం అవసరమని సూచించారు. కార్యక్రమంలో వైద్యులు, ఆసుపత్రి యాజమాన్యం, ప్రజాప్రతినిధులు, ప్రముఖులు పాల్గొన్నారు. ఆసుపత్రి ద్వారా ప్రజలకు నాణ్యమైన దంత వైద్య సేవలు అందాలని స్పీకర్ ఆకాంక్షించారు.



## రేవంత్ ప్రభుత్వంపై కేటీఆర్ విమర్శలు



- అప్పులు, హామీలు, భూవ్యాపార రంగంపై ప్రశ్నల వర్షం
- మళ్లీ కేసీఆర్ నాయకత్వంలోనే ప్రభుత్వం అంటూ ధీమా
- ప్రజా సంక్షేమం, కార్యకర్తల సంక్షేమం రెండింటికీ ప్రాధాన్యమని వ్యాఖ్య

హైదరాబాద్, జూన్ 25 (తెలంగాణ ముచ్చట్లు):

బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై తీవ్ర విమర్శలు గుప్పించారు. కొత్త రాష్ట్రంగా తెలంగాణ ప్రతిష్ఠ దెబ్బతినకుండా ఉండాలనే ఉద్దేశంతో గతంలో పాలనపై ఎక్కువ దృష్టి పెట్టామని, పార్టీ వ్యవహారాలపై అంతగా దృష్టి సారించలేకపోయామని పేర్కొన్నారు. అయితే రాబోయే కాలంలో పార్టీని మరింత బలోపేతం చేస్తామని చెప్పారు. 2028లో కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపడతారని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. ఆ తర్వాత ప్రజల సంక్షేమంతో పాటు

మిగతా 2లో

## స్థానికత హక్కుల కోసం పోరాటం కొనసాగిస్తాం

- హైకోర్టు తీర్పుపై సుప్రీంకోర్టులో పునర్విమర్శ పిటిషన్ వేయాలని డిమాండ్
- గ్రూప్-1 నియామకాలలో తెలంగాణ యువతకు అన్యాయం జరిగిందని ఆరోపణ
- సోమాజిగూడలో తెలంగాణ స్థానికతపై రౌండ్ టేబుల్ సమావేశం




హైదరాబాద్, జూన్ 25 (తెలంగాణ ముచ్చట్లు):

స్థానికత హక్కుల పరిరక్షణ కోసం తెలంగాణ ప్రజలు శతాబ్దాలుగా పోరాటం చేస్తున్నారని, ఈ అంశంలో ఎలాంటి రాజీకి తావులేదని టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో తెలంగాణ రక్షణ సేన ఆధ్వర్యంలో నిర్వహించిన 'తెలంగాణ స్థానికత - సవాళ్లు' అంశంపై

మిగతా 2లో

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# ప్రభుత్వ ఉద్యోగులకు బీమా రక్షణ కల్పిస్తున్నాం

(మొదటి పేజీ తరువాయి)

పీఆర్సీ అమలు విషయంలో కూడా ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకుంటుందని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్ర ఆదాయాన్ని పెంచడంలో ఉద్యోగులు భాగస్వాములు కావాలని, రోజుకు అదనంగా ఒక గంట పనిచేసి తెలంగాణ అభివృద్ధికి తోడ్పడాలని కోరారు.

రేషన్ కార్డులు, ఉచిత విద్యుత్, తక్కువ ధర గ్యాస్ సిలిండర్లు, విద్యా, మహిళా సంక్షేమ పథకాల అమలులో ప్రభుత్వ ఉద్యోగుల పాత్ర కీలకమని సీఎం ప్రశంసించారు. ప్రభుత్వ ప్రతిష్ఠను పెంచడంలో ఉద్యోగులే బ్రాండ్ అంబాసిడర్లని పేర్కొన్నారు. కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, వివేక్ వెంకటస్వామి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు, డీజీపీ సీవీ ఆనంద్, బ్యాంకుల ప్రతినిధులు, ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొన్నారు.






# ఓటరు వివరాల సవరణలో అప్రమత్తంగా ఉండాలి

(మొదటి పేజీ తరువాయి)

మంత్రి సూచించారు. వ్యక్తిగత వివరాలు, కుటుంబ సభ్యుల వివరాలు, చిరునామా వంటి సమాచారాన్ని సక్రమంగా నమోదు చేయాలని కోరారు. తప్పులు లేకుండా వివరాలు అందించడం ద్వారా భవిష్యత్తులో ఇబ్బందులు తలెత్తకుండా ఉంటాయని తెలిపారు. అర్హులైన ఓటర్లు జాబితాలో కొనసాగేందుకు ఈ ప్రక్రియ ఎంతో ముఖ్యమని మంత్రి పేర్కొన్నారు. కొత్తగా ఓటు హక్కు పొందే యువత కూడా అవసరమైన పత్రాలతో నమోదు ప్రక్రియలో పాల్గొనాలని సూచించారు. ప్రజలు నిర్లక్ష్యం వహిస్తే ఓటరు జాబితాలో లోపాలు ఏర్పడే అవకాశం ఉందన్నారు.

బూత్ స్థాయి అధికారులు ప్రజలకు పూర్తి స్థాయిలో సహకరించాలని మంత్రి ఆదేశించారు. ప్రతి ఇంటికి చేరుకుని వివరాలను సేకరించడంతో పాటు సవరణ ప్రక్రియపై అవగాహన కల్పించాలని సూచించారు. ప్రజల సందేహాలను నివృత్తి చేస్తూ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని కోరారు. ఓటరు జాబితా ఖచ్చితత్వం ఎన్నికల నిర్వహణలో కీలక పాత్ర పోషిస్తుందని మంత్రి తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరి పేరు జాబితాలో ఉండేలా అధికారులు, ప్రజలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజాస్వామ్య బలోపేతానికి ఇది అత్యంత ముఖ్యమైన ప్రక్రియ అని వివరించారు. ప్రజలు చివరి తేదీ వరకు వేచి చూడకుండా ముందుగానే ఫారాలు పూర్తి చేసి సమర్పించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు. ఓటు హక్కును పరిరక్షించుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొంటూ, సవరణ ప్రక్రియలో అందరూ చురుకుగా పాల్గొనాలని పిలుపునిచ్చారు.

# బంజారా రిజర్వేషన్ స్వర్ణోత్సవ బస్సు యాత్ర ప్రారంభం

హైదరాబాద్, జూన్ 25 (తెలంగాణ ముచ్చట్లు):

బంజారా సమాజానికి రిజర్వేషన్లు కల్పించి 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఆదివాసీ కాంగ్రెస్ ఆధ్వర్యంలో చేపట్టిన బస్సు యాత్ర గురువారం గాంధీ భవన్‌లో ప్రారంభమైంది. తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు, శాసన మండలి సభ్యుడు మహేష్‌కుమార్ గౌడ్ జెండా ఊపి యాత్రను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పలువురు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఆదివాసీ నాయకులు పాల్గొన్నారు. బంజారా సమాజ అభ్యున్నతిలో రిజర్వేషన్ల పాత్ర ఎంతో కీలకమని ఈ సందర్భంగా నాయకులు పేర్కొన్నారు. విద్య, ఉపాధి, రాజకీయ రంగాల్లో ఆదివాసీ వర్గాలకు అవకాశాలు కల్పించడంలో రిజర్వేషన్లు ముఖ్యమైన సాధనంగా నిలిచాయని వివరించారు. ఈ చారిత్రక నిర్ణయానికి ఐదు దశాబ్దాలు పూర్తవడం ప్రత్యేక సందర్భంగా అభివర్ణించారు. యాత్ర ప్రారంభ కార్యక్రమంలో అఖిల భారత కాంగ్రెస్ కమిటీ ఎస్టీ విభాగం జాతీయ అధ్యక్షుడు విక్రాంత్ భూరియా, మంత్రులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్, జూపల్లి కృష్ణారావు, ఎంపీలు వేమ్ నరేందర్ రెడ్డి, బలరాం నాయక్ పాల్గొన్నారు. అలాగే రాష్ట్ర ఆదివాసీ కాంగ్రెస్ అధ్యక్షుడు, శాసన మండలి సభ్యుడు శంకర్ నాయక్‌తో పాటు




పలువురు ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. ఆదివాసీ సమాజ సంక్షేమం, హక్కుల పరిరక్షణ, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజల్లో అవగాహన కల్పించడమే ఈ యాత్ర ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో ఈ యాత్ర కొనసాగనున్నట్లు వెల్లడించారు. ఆదివాసీ వర్గాల సమస్యలను ప్రజల ముందుకు తీసుకురావడంలో యాత్ర దోహదపడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్ రాంచంద్రు నాయక్, ఎమ్మెల్యేలు బాలు నాయక్, రాందాస్ నాయక్, మురళీ నాయక్, ట్రైకార్ సంస్థ అధ్యక్షుడు బెల్లయ్య నాయక్, మాజీ శాసన మండలి సభ్యుడు రాములు నాయక్, రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు శివ చరణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో ఆదివాసీ నాయకులు, కార్యకర్తలు హాజరై యాత్రకు మద్దతు తెలిపారు. బంజారా రిజర్వేషన్ స్వర్ణోత్సవాల సందర్భంగా చేపట్టిన ఈ బస్సు యాత్ర ఆదివాసీ సమాజ చరిత్ర, హక్కులు, అభివృద్ధి అంశాలను ప్రజల్లో మరింతగా చర్చకు తీసుకురానుందని నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు. సమాజ అభ్యున్నతి కోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను కూడా ప్రజలకు వివరించనున్నట్లు తెలిపారు.

# స్థానికత హక్కుల కోసం పోరాటం కొనసాగిస్తాం

(మొదటి పేజీ తరువాయి)

రౌండ్ టేబుల్ సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. స్థానికత అంశంపై హైకోర్టు ఇచ్చిన తీర్పును రాష్ట్ర ప్రభుత్వం సవాల్ చేస్తూ సుప్రీం కోర్టులో పునర్విమర్శ పిటిషన్ దాఖలు చేయాలని కవిత డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే నిరుద్యోగులు, ఉద్యమకారులతో కలిసి తామే న్యాయపోరాటం చేస్తామని హెచ్చరించారు. రాష్ట్రపతి ఉత్తర్వుల అసలు స్ఫూర్తిని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.

తెలంగాణలో ఉద్యోగాల విషయంలో చారిత్రకంగా స్థానికులు అన్యాయం ఎదుర్కొన్నారని కవిత పేర్కొన్నారు. బహుమనీ కాలం నుంచి ముల్కీ నిబంధనలు, ఆరు సూత్రాల పథకం, 610 జీవో వరకు జరిగిన పరిణామాలను ప్రస్తావిస్తూ స్థానిక హక్కుల కోసం ఎన్నో ఉద్యమాలు జరిగాయని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా సమస్య పూర్తిగా పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

గ్రూప్1 నియామకాలలో తెలంగాణ అభ్యర్థులకు తీవ్ర అన్యాయం జరిగిందని కవిత ఆరోపించారు. రాష్ట్రపతి ఉత్తర్వుల ప్రకారం స్థానికులకు రావాల్సిన అవకాశాలు ఇతర రాష్ట్రాల అభ్యర్థులకు దక్కేలా వ్యవహరించారని విమర్శించారు. తెలంగాణ యువతకు చెందాల్సిన ఉద్యోగాలు స్థానికేతరులకు వెళ్లే పరిస్థితి ఏర్పడిందని అన్నారు. తమ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రూప్1 నియామకాలపై సమగ్ర సమీక్ష చేపడతామని కవిత తెలిపారు. అవసరమైతే న్యాయపరమైన సమీక్ష కమిటీ ఏర్పాటు చేసి నియామకాల ప్రక్రియను పరిశీలిస్తామని చెప్పారు. తెలంగాణ యువత భవిష్యత్తుతో ముడిపడిన అంశాల్లో రాజీ పడబోమని స్పష్టం చేశారు.

నీటి వాటాలు, ఉద్యోగాలు, పెట్టుబడులు, స్థానిక హక్కుల అంశాల్లో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని కవిత విమర్శించారు. తెలంగాణ ప్రజల ప్రయోజనాల కోసం పోరాటం కొనసాగుతుందని, జూలై 2న ఉప్పల్‌లో నిర్వహించనున్న కార్యక్రమం ద్వారా స్థానికత అంశాన్ని మరింత బలంగా ప్రజల్లోకి తీసుకెళ్తామని తెలిపారు. నిరుద్యోగులు, ఉద్యమకారులు, తెలంగాణ ప్రజల పక్షాన టీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.




# రేవంత్ ప్రభుత్వంపై కేటీఆర్ విమర్శలు

(మొదటి పేజీ తరువాయి)

పార్టీ కార్యకర్తల బాగోగులను కూడా సమానంగా చూసుకునే బాధ్యత తనదేనని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంతో పాటు పార్టీ శ్రేణులకు అండగా నిలుస్తామని పేర్కొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం రెండున్నరేళ్లలో నాలుగు లక్షల కోట్ల రూపాయల అప్పులు చేసినా ప్రజలకు ఏమి ప్రయోజనం కలిగిందో చెప్పాలని కేటీఆర్ ప్రశ్నించారు. రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయడానికి అవసరమైన గోనె సంచులు లేకపోయినా, ఇతర కార్యక్రమాలకు మాత్రం సంచులు అందుబాటులో ఉండటం ఏమిటని విమర్శించారు. ప్రభుత్వ ప్రాధాన్యతలపై ప్రజలకు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందన్నారు.



ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలుపై కూడా కేటీఆర్ ప్రశ్నలు లేవనెత్తారు. వంద రోజుల్లో అన్ని హామీలు అమలు చేస్తామని చెప్పిన నాయకులు ఇప్పుడు వాటి గురించి ఎందుకు మాట్లాడడం లేదని నిలదీశారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు.

రియల్ ఎస్టేట్ రంగం పరిస్థితిపై కూడా కేటీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో భూవ్యాపార రంగాన్ని అభివృద్ధి చేస్తామని చెప్పిన ప్రభుత్వం ప్రస్తుతం ఆ రంగాన్ని తీవ్ర సంక్షోభంలోకి నెట్టిందని విమర్శించారు. దీనివల్ల ఉపాధి, పెట్టుబడులు, అనుబంధ రంగాలు దెబ్బతిన్నాయని పేర్కొన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, రైతుల సమస్యలు, ఎన్నికల హామీలు, భూవ్యాపార రంగం వంటి అంశాలపై ప్రభుత్వం ప్రజలకు స్పష్టత ఇవ్వాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్తామని, రాబోయే రోజుల్లో పార్టీ కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహిస్తామని తెలిపారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక





# పశువుల ఆరోగ్యమే రైతు ఆర్థిక బలం

- **గోపాల్పూర్‌లో ఉచిత ఎల్ఎస్‌డీ నిరోధక టీకాల శిబిరం**

**ఎల్కతుర్తి, జూన్ 25 (తెలంగాణ ముచ్చట్లు):** హన్మకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం గోపాల్పూర్ గ్రామంలోని సబ్ సెంటర్‌లో గురువారం పశు వైద్య మరియు పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచిత ఎల్ఎస్‌డీ (లంపీ స్కిన్ డిసీజ్) నిరోధక టీకాల శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గ్రామ సర్పంచ్ శ్రీమతి కె. లక్ష్మి శిబిరాన్ని ప్రారంభించారు.

ఈ సందర్భంగా పశువైద్యాధికారి డాక్టర్ పి. రవీందర్ రెడ్డి మాట్లాడుతూ పశువుల ఆరోగ్యమే రైతు ఆర్థిక బలమని అన్నారు. పాడి పశువులకు ఎల్ఎస్‌డీ వ్యాధి సోకకుండా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా టీకాలు వేస్తున్నామని తెలిపారు. టీకాలు వేసిన పశువుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి ప్రభుత్వ రికార్డుల్లో పొందుపరుస్తున్నామని చెప్పారు. రైతులు తమ పశువులకు తప్పనిసరిగా టీకాలు వేయించుకోవాలని, వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే పశువైద్య సిబ్బందిని సంప్రదించాలని సూచించారు.

పశుసంపద రైతు కుటుంబాలకు ప్రధాన ఆదాయ వనరుగా నిలుస్తోందని, పశువులను వ్యాధుల బారిన పడకుండా కాపాడుకోవడం ద్వారా రైతులు ఆర్థికంగా మరింత బలోపేతం అవుతారని పేర్కొన్నారు. ఎల్ఎస్‌డీ వ్యాధి నివారణకు టీకాలే అత్యంత ప్రభావవంతమైన మార్గమని రైతులకు అవగాహన కల్పించారు.

సర్పంచ్ కె. లక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వం చేపడుతున్న ఉచిత టీకాల కార్యక్రమాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రామంలోని ప్రతి పాడి పశువుకు టీకాలు వేయించి వ్యాధి రహిత గ్రామంగా తీర్చిదిద్దేందుకు అందరూ సహకరించాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో వీఎల్‌వో సతీష్, జేఈవో రజిత, రాకేష్ రెడ్డి, ఎల్ఎస్ఏలు, గోపాలమిత్రలు, రైతు సోదరులు పాల్గొన్నారు. శిబిరంలో పెద్ద సంఖ్యలో పాడి పశువులకు ఎల్ఎస్‌డీ టీకాలు వేసి, వ్యాధి నివారణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడింది.

# డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణమే లక్ష్యం

- **మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలి : సీఐ పులి రమేష్**




**ఎల్కతుర్తి, జూన్ 25 (తెలంగాణ ముచ్చట్లు):** యువతను డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాల బారిన పడకుండా కాపాడేందుకు సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని ఎల్కతుర్తి సీఐ పులి రమేష్ అన్నారు. హన్మకొండ జిల్లా ఎల్కతుర్తి మండల కేంద్రంలో గురువారం డ్రగ్స్ నిర్మూలనపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్యంగా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మునిగడప లావణ్య శేషు పాల్గొన్నారు. పాఠశాల విద్యార్థులు, విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు, వార్డు సభ్యులు, గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఐ పులి రమేష్ మాట్లాడుతూ డ్రగ్స్ వినియోగం యువత భవిష్యత్తును నాశనం చేయడమే కాకుండా కుటుంబాలను కూడా విచ్ఛిన్నం చేస్తోందన్నారు. విద్యార్థులు చదువుపై దృష్టి సారించి ఉన్నత లక్ష్యాలను సాధించాలని, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. డ్రగ్స్ విక్రయాలు, వినియోగంపై సమాచారం అందిస్తే వెంటనే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఎస్సై నర్సింహరావు మాట్లాడుతూ పాఠశాలలు ప్రారంభమైన నేపథ్యంలో తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తన, స్నేహితుల వర్గం, రోజువారీ అలవాట్లను గమనించాలని సూచించారు. పిల్లలు చెడు వ్యసనాలకు గురికాకుండా కుటుంబ సభ్యులు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు.

అనంతరం డ్రగ్స్ నిర్మూలనపై ప్రజల్లో చైతన్యం కల్పించేందుకు బస్టాండ్ సర్కిల్ ప్రాంతంలో భారీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో విద్యార్థులు, తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, గ్రామస్తులు పాల్గొని డ్రగ్స్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మత్తు పదార్థాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో భాగంగా విద్యార్థులను మత్తు పదార్థాల బారిన పడనివ్వబోమని, వారి భవిష్యత్తు రక్షణకు కట్టుబడి ఉంటామని తల్లిదండ్రుల నుంచి ప్రతిజ్ఞ పత్రాలు స్వీకరించారు. డ్రగ్స్ రహిత ఎల్కతుర్తి నిర్మాణానికి ప్రజల సహకారం ఎంతో అవసరమని పోలీసులు పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో సెయింట్ థామస్ అల్టిట్యూడ్ హై స్కూల్ విద్యార్థులు సైతం ఉత్సాహంగా పాల్గొని డ్రగ్స్ వ్యతిరేక నినాదాలతో అవగాహన ర్యాలీలో పాల్గొన్నారు. అలాగే ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉపాధ్యాయులు, వివిధ పాఠశాలల విద్యార్థులు, విద్యార్థినులు, తల్లిదండ్రులు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.

# ఓటరు జాబితా సవరణపై అధికారుల ముమ్మర ప్రచారం





**–ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమంపై అవగాహన ర్యాలీ**

**ఎల్కతుర్తి, జూన్ 25 (తెలంగాణ ముచ్చట్లు):** హన్మకొండ జిల్లా ఎల్కతుర్తి మండల కేంద్రంలో భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు చేపట్టిన ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమం-2026పై గురువారం అధికారులు ముమ్మర ప్రచారం నిర్వహించారు. ఓటరు జాబితాలో అర్హులైన ప్రతి ఒక్కరి పేరును నమోదు చేయడం, మార్పులు, చేర్పులు, తొలగింపుల ప్రక్రియను ప్రజలకు చేరవేయడం లక్ష్యంగా అవగాహన ర్యాలీ, ప్రచార కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా అధికారులు, ప్రజాప్రతినిధులు, బూత్ స్థాయి అధికారులు, అంగన్‌వాడీ సిబ్బంది గ్రామంలో ర్యాలీ నిర్వహించి ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేశారు. ఓటరు జాబితాలో పేరు నమోదు, మార్పులు, చేర్పులు, తొలగింపులకు సంబంధించిన వివరాలను ప్రజలకు వివరించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ఓటరు నమోదు ప్రాముఖ్యతను తెలియజేశారు.

18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న ప్రతి యువకుడు, యువతి తమ పేరును ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రతి అర్హుడైన పౌరుడు ఎన్నికల ప్రక్రియలో భాగస్వామి కావాలని అధికారులు పిలుపునిచ్చారు.

ఓటరు జాబితాలో తమ పేరు ఉందో లేదో ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పరిశీలించుకోవాలని, ఏవైనా తప్పులు ఉంటే వెంటనే సంబంధిత అధికారులకు తెలియజేయాలని సూచించారు. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడంలో ప్రతి ఓటు కీలకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, బూత్ స్థాయి అధికారులు, అంగన్‌వాడీ సిబ్బంది, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు. గ్రామ ప్రజలు ఉత్సాహంగా పాల్గొని ఓటరు నమోదు, సవరణ ప్రక్రియపై ఆసక్తి కనబరిచారు. "మీ ఓటు – మీ హక్కు.. మీ పేరు ఓటరు జాబితాలో ఉందో లేదో ఇప్పుడే నిర్ధారించుకోండి" అంటూ అధికారులు ప్రజలకు అవగాహన కల్పించారు.

# పామిరెడ్డిపల్లిలో ఎస్ఐఆర్–2026 నమోదు ప్రక్రియ ప్రారంభం

**పెద్దమందడి,జూన్25(తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ ఐ ఆర్)-2026 కార్యక్రమం పెద్దమందడి మండలం పామిరెడ్డిపల్లి గ్రామంలో గురువారం ప్రారంభమైంది.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మధిర మంజుల శ్రీశైలం పాల్గొని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఎస్ఐఆర్ ప్రక్రియ ద్వారా ఓటర్ల వివరాల నమోదు పారదర్శకంగా, కచ్చితత్వంతో నిర్వహించబడుతుందని తెలిపారు. గ్రామంలోని అర్హులైన ప్రతి ఓటరు తమ వివరాలను స్థానిక బూత్ లెవల్ అధికారులకు (బీఎల్ఓలు) సక్రమంగా అందించాలని సూచించారు.భవిష్యత్తులో ఓటరు జాబితాకు సంబంధించిన ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు ఈ ప్రక్రియ ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. ప్రజలందరూ అధికారులకు పూర్తి స్థాయిలో సహకరించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ఇంద్రా లక్ష్మారెడ్డి, మాజీ సర్పంచులు సిద్దయ్య, తిక్కన్న, వార్డు సభ్యులు



కృష్ణ, నరేష్, భాస్కర్, కొంకలి నరసింహ, మండల ఆర్ఐ శంకర్, జీపీఓ నాగరాజు, పంచాయతీ కార్యదర్శి స్రవంతి, బీఎల్ఓలు సునీత, లక్ష్మి, భాగ్యమ్మ, శారద తదితరులు, స్థానిక ప్రజాప్రతినిధులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

# జమ్ములమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్న డాక్టర్ జిల్లెల ఆదిత్య రెడ్డి

**పెబ్బేరు,జూన్25(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా పెబ్బేరు మండలం రాంపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన జమ్ములమ్మ తల్లి దేవాలయంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఐపీసీ రాష్ట్ర చైర్మన్, వనపర్తి నియోజకవర్గ యువ నాయకుడు డాక్టర్ జిల్లెల ఆదిత్య రెడ్డి పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.గ్రామ ప్రజల ఆహ్వానం మేరకు కార్యక్రమానికి హాజరైన ఆయన, జమ్ములమ్మ తల్లి ఆశీస్సులు గ్రామ ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు.గత రెండు రోజులుగా హోమాలు, ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొనగా, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజా కార్యక్రమాలను విజయవంతం చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మహేశ్వరమ్మ-శివరాజు, సహదేవుడు, ఈశ్వర్ రెడ్డి, కృపాకర్ రెడ్డి, సత్యనారాయణ రెడ్డి, రామ్మోహన్ రెడ్డి, ఎం.కె. మూర్తి, ఎం. దేవన్న యాదవ్, పాతపల్లి చంద్రశేఖర్, పి. అనిల్, జక్కుల సూరేష్, గోఖరి, కాశన్న, బాలరాం, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.







# సీఎం సహాయ నిధి నిరుపేదలకు వరం

- **వరంగల్ ఎంపీ కడియం కావ్య**

**వరంగల్, జూన్ 25 (తెలంగాణ ముచ్చట్లు):** అనారోగ్యంతో బాధపడుతూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నిరుపేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి గొప్ప వరంగా నిలుస్తోందని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు కడియం కావ్య అన్నారు. ప్రజల ప్రాణాలను కాపాడడంలో సీఎం సహాయ నిధి కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు.వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని పలువురు లబ్ధిదారులకు మంజూరైన రూ.3.50 లక్షల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను కనకదుర్గ కాలనీలోని ఎంపీ క్యాంపు కార్యాలయంలో గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు, వారి కుటుంబ సభ్యులతో మాట్లాడి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకుని ధైర్యం చెప్పారు.

ఈ సందర్భంగా కడియం కావ్య మాట్లాడుతూ, పేద, మధ్యతరగతి కుటుంబాలు తీవ్రమైన అనారోగ్య పరిస్థితుల్లో వైద్య ఖర్చులు భరించడం ఎంతో కష్టమవుతోందన్నారు. ముఖ్యంగా కార్పొరేట్ ఆసుపత్రుల్లో చికిత్స కోసం లక్షల రూపాయలు ఖర్చు కావడంతో అనేక కుటుంబాలు అప్పుల పాలవుతున్నాయని తెలిపారు. అలాంటి సమయంలో రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సీఎం సహాయ నిధి ఎంతో ఉపశమనాన్ని కలిగిస్తోందని చెప్పారు. ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని, అర్హులైన ప్రతి నిరుపేద కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. అవసరమైన సహాయం కోసం ప్రజలు ప్రజాప్రతినిధులను సంప్రదించాలని సూచించారు. కష్టకాలంలో తమకు ఆర్థిక చేయూత అందించినందుకు లబ్ధిదారులు కడియం కావ్యకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# గ్రీన్‌ఫీల్డ్ రహదారిపై దగ్ధమైన కారు

- **టైరు పేలడంతో అదుపుతప్పిన వాహనం.**
- **సమయస్ఫూర్తితో బయటపడిన ఏడుగురు యువకులు.**

**సత్తుపల్లి, జూన్ 25 (తెలంగాణ ముచ్చట్లు):** సత్తుపల్లి నియోజకవర్గ పరిధిలోని వేంసూరు సమీపంలోని గ్రీన్‌ఫీల్డ్ హైవేపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ కారు పూర్తిగా దగ్ధమైంది. కారులో ప్రయాణిస్తున్న ఏడుగురు యువకులు ప్రమాదాన్ని గుర్తించి వెంటనే బయటకు రావడంతో పెను ప్రమాదం తప్పింది. పోలీసుల కథనం ప్రకారం.. హైదరాబాద్ నుంచి ఎర్రవరం వైపు కారులో వెళ్తున్న యువకులు వేంసూరు సమీపానికి చేరుకోగానే వాహనం ముందు టైరు అకస్మాత్తుగా పేలింది. దీంతో కారు అదుపుతప్పి రోడ్డుపక్కనున్న రక్షణ రైలింగ్‌ను బలంగా ఢీకొట్టింది. ఢీకొన్న వెంటనే కారులో మంటలు చెలరేగడంతో యువకులు అప్రమత్తమై వెంటనే బయటకు వచ్చారు. ఈ ఘటనలో వారికి స్వల్ప గాయాలే కాగా, కారు పూర్తిగా అగ్నికి ఆహుతైంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. స్థానికులు, హైవే సిబ్బంది సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

## హక్కుల పరిరక్షణ కోసం హైదరాబాద్ బాట పట్టిన ఉప సర్పంచులు




**హుజూరాబాద్, జూన్ 25 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉప సర్పంచుల హక్కుల పరిరక్షణ, గ్రామ పంచాయతీల సమస్యల పరిష్కారం కోసం గురువారం హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద నిర్వహించిన "హలో ఉప సర్పంచ్ - చలో హైదరాబాద్" మహాధర్నాలో హుజూరాబాద్ మండలానికి చెందిన ఉప సర్పంచులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. హుజూరాబాద్ మండల ఉప సర్పంచుల ఫోరం అధ్యక్షుడు వన్నాల శివాజీ ఆధ్వర్యంలో 20 గ్రామాల ఉప సర్పంచులు ఈ ధర్నాకు హాజరై తమ డిమాండ్లను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లారు. ఉప సర్పంచుల సంఘం, సర్పంచుల ఫోరం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ మహాధర్నాలో రాష్ట్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీల్లో ఉప సర్పంచులకు ఉన్న చెక్ పవర్‌ను రద్దు చేసే ప్రతిపాదనను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే గ్రామ పంచాయతీల్లో పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే విడుదల చేయాలని, స్థానిక సంస్థల ఆర్థిక పరిస్థితిని మెరుగుపరిచే చర్యలు చేపట్టాలని కోరారు.

ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ గ్రామ పాలనలో ఉప సర్పంచుల పాత్ర కీలకమని, వారి అధికారాలను కుదించే నిర్ణయాలు ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు. ఉప సర్పంచుల హక్కులను కాపాడడంతో పాటు గ్రామాభివృద్ధిలో వారికి తగిన ప్రాధాన్యం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో సర్పంచులు, ఉప సర్పంచులు ధర్నాకు తరలివచ్చి సంఘీభావం తెలిపారు. గ్రామ పంచాయతీలకు నిధుల కొరత, పెండింగ్ బిల్లుల సమస్య, చెక్ పవర్ రద్దు వంటి అంశాలపై గత కొంతకాలంగా సర్పంచుల ఫోరం జేఏసీ ప్రభుత్వం దృష్టికి సమస్యలను తీసుకెళ్తున్న విషయం తెలిసిందే.

హుజూరాబాద్ మండలానికి చెందిన ఉప సర్పంచులు మాట్లాడుతూ తమ హక్కులు, అధికారాల పరిరక్షణ కోసం అవసరమైతే భవిష్యత్తులో కూడా ఉద్యమాలను కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ మహాధర్నా విజయవంతం కావడంతో రాష్ట్ర ప్రభుత్వం ఉప సర్పంచుల సమస్యలపై సానుకూలంగా స్పందించాలని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.

## జమ్ములమ్మ అమ్మవారి ప్రతిష్ఠ మహోత్సవంలో ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి



**వనపర్తి,జూన్25(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా పెబ్బేరు మండలం రామాపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన జమ్ములమ్మ అమ్మవారి దేవాలయంలో నిర్వహించిన విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీస్సులు పొందారు.అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామ దేవతల పండుగలు గ్రామ ప్రజల మధ్య ఐక్యత, సామరస్యానికి ప్రతీకగా నిలుస్తాయని అన్నారు.భక్తిశ్రద్ధలతో నిర్వహించే ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు గ్రామాల్లో సాంస్కృతిక సంప్రదాయాలను పరిరక్షించడంలో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు.జమ్ములమ్మ అమ్మవారి కృపతో రామాపురం గ్రామంతో పాటు వనపర్తి నియోజకవర్గం మొత్తం సుభిక్షంగా ఉండాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖశాంతులతో జీవించాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో పెబ్బేరు మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, వైస్ చైర్మన్ సుమిత్ర ఎల్లారెడ్డి, పెబ్బేరు మార్కెట్ యార్డ్ అధ్యక్షురాలు ప్రమోదిని రెడ్డి, ఉపాధ్యక్షుడు విజయవర్ధన్ రెడ్డి, మండల అధ్యక్షుడు యాపర్ల రామిరెడ్డి, పెబ్బేరు పట్టణ అధ్యక్షుడు దయాకర్ రెడ్డి, నాయకులు రంజిత్ కుమార్, సురేందర్ గౌడ్, వెంకటేష్ సాగర్, గ్రామ నాయకులు సత్యనారాయణ రెడ్డి, భగవంతుతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పరిశ్రమల అభివృద్ధితో గ్రామీణ ప్రగతి సాధ్యం

- డాక్టర్ జిల్లెల ఆదిత్య రెడ్డి



**వనపర్తి,జూన్25(తెలంగాణ ముచ్చట్లు):** గ్రామీణ ప్రాంతాల్లో పరిశ్రమల స్థాపనతో ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు స్థానిక ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని ఏఐపిసి రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జిల్లెల ఆదిత్య రెడ్డి అన్నారు.వనపర్తి మండలంలోని నాచహళ్లి గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన రైస్ మిల్లు ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పెబ్బేరు మండలానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు రవి నాయక్ ఆహ్వానం మేరకు కార్యక్రమానికి హాజరైన డాక్టర్ ఆదిత్య రెడ్డి మిల్లును ప్రారంభించి నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు రైతులకు, వ్యవసాయ కార్మికులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇటువంటి పరిశ్రమలు నెలకొల్పడం ద్వారా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు గ్రామాల అభివృద్ధికి దోహదపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.





## హుజురాబాద్‌లో పలు వార్డుల్లో ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవం

- పేదల సొంతింటి కలను సాకారం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

**హుజురాబాద్,జూన్ 25(తెలంగాణ ముచ్చట్లు ):** హుజురాబాద్ పట్టణంలోని పలు వార్డుల్లో నిర్మాణం పూర్తయిన ఇందిరమ్మ ఇళ్లను మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీమతి రొంటాల సుహాసిని మనోజ్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి గృహాలను పరిశీలించడంతో పాటు కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రప్రభుత్వం పేదల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ అమలు చేస్తున్న ఇందిరమ్మ గృహ పథకం ద్వారా వేలాది కుటుంబాలకు సొంతింటి కల నెరవేరుతోందని ఆమె పేర్కొన్నారు. సొంత ఇల్లు అనేది ప్రతి కుటుంబానికి ఒక భద్రత, ఆత్మవిశ్వాసాన్ని అందిస్తుందని, అలాంటి అవకాశాన్ని కల్పించడం ప్రభుత్వ గొప్ప సంకల్పమని ఆమె అన్నారు. ముఖ్యమంత్రి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి అనే ద్వంద్వ లక్ష్యాలతో ముందుకు సాగుతోందని, అందులో భాగంగానే గృహహీనులకు గౌరవప్రదమైన జీవనం అందించేందుకు ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందని వివరించారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాల ఫలాలు అందేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తున్నారని చెప్పారు. ప్రారంభించిన ఇళ్లలో నివసించే కుటుంబాలతో చర్చించిన చైర్‌పర్సన్, వారి సమస్యలు, అవసరాలను తెలుసుకున్నారు. మౌలిక వసతుల కల్పనలో కూడా మున్సిపాలిటీ ప్రత్యేక దృష్టి సారిస్తోందని తెలిపారు. పట్టణంలోని ప్రతి వార్డులో అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని, ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కిషన్, టౌన్ ప్రెసిడెంట్ తిరుపతి, కౌన్సిలర్లు శ్రీలేఖ, సమ్మయ్య, మొగిలి, మున్సిపల్ ఏఈ నరేష్, హౌసింగ్ ఏఈ రోజా, వార్డ్ అధికారులు, మున్సిపల్ సిబ్బంది, స్థానిక నాయకులు, లబ్ధిదారులు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. కార్యక్రమం సందర్భంగా లబ్ధిదారులు తమకు సొంతింటి కలను నెరవేర్చిన ప్రభుత్వానికి, ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలియజేశారు. పలు వార్డుల్లో జరిగిన ఈ ప్రారంభోత్సవ కార్యక్రమాలు ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగాయి.

## మహిళా సంఘాల పనితీరు ప్రశంసనీయం



- మహిళల సాధికారతకు హనుమకొండ ఆదర్శం
- జె-పాల్, హార్వర్డ్ ప్రతినిధుల ప్రశంసలు

**హనుమకొండ,జూన్ 25 (తెలంగాణ ముచ్చట్లు):** మహిళల ఆర్థిక సాధికారత, స్వయం ఉపాధి, సామాజిక అభివృద్ధి దిశగా హనుమకొండ జిల్లాలో మహిళా స్వయం సహాయక సంఘాలు సాధిస్తున్న ప్రగతి అభినందనీయమని జెపాల్, హార్వర్డ్ విశ్వవిద్యాలయ ప్రతినిధుల బృందం పేర్కొంది.

గురువారం జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయితో అంతర్జాతీయ ప్రతినిధుల బృందం సమావేశమైంది. హార్వర్డ్ విశ్వవిద్యాలయానికి చెందిన ప్రొఫెసర్ ఏమిలి బ్రేజా, కార్తీక్ శ్రీవాత్సవతో పాటు జెపాల్ దక్షిణాసియా ప్రతినిధులు సమావేశంలో పాల్గొన్నారు.

అంతకుముందు ప్రతినిధుల బృందం ఓరుగల్లు మహిళా సమాఖ్య కార్యాలయాన్ని సందర్శించి, మహిళా స్వయం సహాయక సంఘాల కార్యకలాపాలు, గ్రామీణ మహిళల జీవితాల్లో వచ్చిన సామాజిక, ఆర్థిక మార్పులను పరిశీలించింది. సమాఖ్య అమలు చేస్తున్న కార్యక్రమాలు, జీవనోపాధి అవకాశాల విస్తరణ, ఆర్థిక స్వావలంబన దిశగా సాధించిన పురోగతిని ఆసక్తిగా అధ్యయనం చేసింది.పరకాల మహిళా డెయిరీని సందర్శించిన బృందం మహిళలు సమిష్టి కృషితో నిర్వహిస్తున్న డెయిరీ కార్యకలాపాలను పరిశీలించి ప్రశంసించింది. గ్రామీణ మహిళల ఆదాయ వృద్ధికి డెయిరీ రంగం కీలకంగా మారిందని అభిప్రాయపడింది. ఆత్మకూర్, దామెర మండలాల్లో మహిళా సంఘాల పనితీరును క్షేత్రస్థాయిలో పరిశీలించిన ప్రతినిధులు సంఘాల నిర్వహణ, పొదుపు, రుణాల వినియోగం, సూక్ష్మ వ్యాపారాలు, ఆదాయ వనరుల కల్పన, సామాజిక చైతన్యం వంటి అంశాలను అధ్యయనం చేసి సంతృప్తి వ్యక్తం చేశారు.ఈ సమావేశంలో కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి జిల్లాలో మహిళల సాధికారత కోసం అమలు చేస్తున్న కార్యక్రమాలు, స్వయం సహాయక సంఘాల బలోపేతం, జీవనోపాధి అవకాశాల కల్పన, మహిళల నాయకత్వ వికాసానికి చేపడుతున్న చర్యలను వివరించారు.డీఆర్‌డీవో మేన శ్రీను మాట్లాడుతూ, ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల ఫలితంగా మహిళా సంఘాలు బలోపేతమవుతున్నాయని, జిల్లాలో అనేక కుటుంబాలకు ఆర్థిక భరోసాగా నిలుస్తున్నాయని తెలిపారు.

ఈ సందర్భంగా జెపాల్, హార్వర్డ్ ప్రతినిధుల బృందం ఓరుగల్లు మహిళా సమాఖ్య పనితీరు, మహిళల భాగస్వామ్యం, ఆర్థిక స్వావలంబన కోసం చేపడుతున్న వినూత్న కార్యక్రమాలను ప్రశంసించింది. మహిళల అభివృద్ధి, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతంలో హనుమకొండ జిల్లా ఆదర్శవంతమైన నమూనాగా నిలుస్తోందని పేర్కొంది.

జిల్లాలో పర్యటించి పరిశీలించిన అంశాలపై సమగ్ర నివేదికను రూపొందించి సెర్ప్ సీఈవో దివ్య దేవరాజన్‌కు సమర్పించనున్నట్లు ప్రతినిధులు తెలిపారు.ఈ సమావేశంలో ట్రైనీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రోహిత్ నేత, అదనపు డీఆర్‌డీవో వెంకటేశ్వర్లు, మహిళా సమాఖ్య ప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## మత్తు మహమ్మారిపై ఉక్కుపాదం




- ప్రజల సహకారంతోనే నిర్మూలన సాధ్యం
- ఏసీపీ మాధవి

**హుజూరాబాద్,జూన్ 25 (తెలంగాణ ముచ్చట్లు):** సమాజాన్ని మత్తు పదార్థాల రహితంగా తీర్చిదిద్దాలంటే ప్రజల సహకారం అత్యంత కీలకమని హుజూరాబాద్ ఏసీపీ మాధవి తెలిపారు. గంజాయి, డ్రగ్స్ తదితర మత్తు పదార్థాలు యువత భవిష్యత్తును నాశనం చేయడమే కాకుండా కుటుంబాలు, సమాజంపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతున్నాయని పేర్కొన్నారు.

మత్తు పదార్థాల నిర్మూలనలో పోలీసు శాఖతో పాటు ప్రజలు కూడా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. ఎక్కడైనా మత్తు పదార్థాల విక్రయం, రవాణా లేదా వినియోగం జరుగుతున్నట్లు సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు. సమాచారం అందించిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు.

యువత మత్తు పదార్థాలకు బానిస కాకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు నిరంతరం పర్యవేక్షిస్తూ అవగాహన కల్పించాలని సూచించారు. మత్తు పదార్థాల నియంత్రణలో పోలీసుల చర్యలతో పాటు ప్రజల అప్రమత్తత కూడా ఎంతో అవసరమని పేర్కొన్నారు.గ్రామాలు, పట్టణాలు, విద్యాసంస్థలు, యువజన సంఘాలు కలిసి మత్తు వ్యతిరేక ఉద్యమాన్ని బలోపేతం చేస్తేనే ఆశించిన ఫలితాలు సాధ్యమవుతాయని తెలిపారు. యువత ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకుని కుటుంబం, సమాజం, రాష్ట్ర అభివృద్ధికి తోడ్పడాలని పిలుపునిచ్చారు.

## సొంత గ్రామంలోనే ఓటు హక్కు నమోదు చేసుకున్న ఎమ్మెల్యే మేఘారెడ్డి



**పెద్దమందడి,జూన్25(తెలంగాణ ముచ్చట్లు):** ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి ఖచ్చితమైన ఓటరు జాబితా అత్యంత అవసరమని వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి పేర్కొన్నారు. గురువారం ప్రారంభమైన ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా తన సొంత గ్రామమైన మంగంపల్లిలోనే ఓటు హక్కు కొనసాగాలని నిర్ణయించుకుని సంబంధిత అధికారుల నుంచి ధ్రువీకరణ పత్రాన్ని స్వీకరించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తన ఓటు హక్కు సొంత గ్రామంలోనే ఉండాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ప్రతి అర్హత కలిగిన పౌరుడు ఓటరుగా నమోదు కావడం, వివరాలను సరిచేసుకోవడం, కొత్త ఓటర్లను జాబితాలో చేర్చడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు.గ్రామ స్థాయి అధికారులు ఇంటింటికీ వెళ్లి అర్హులైన వారందరినీ ఓటరు జాబితాలో చేర్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.బలమైన ప్రజాస్వామ్యానికి ప్రతి ఓటు విలువైనదేనని, నా ఓటు - నా హక్కు అనే భావనతో ప్రజలందరూ ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా నమోదు పత్రాన్ని గ్రామ స్థాయి అధికారి నారాయణమ్మ నుంచి స్వీకరించారు. ఓటర్ల సందేహాలను నివృత్తి చేస్తూ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఎమ్మెల్యే సూచించారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లిపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# కాగితాలపై అభివృద్ధి కాదు క్షేత్రస్థాయిలో చూపించాలి

- జారీ చేసిన జీవోలకు అనుగుణంగా వెంటనే పనులు ప్రారంభించాలి
- బీజేపీ మండల అధ్యక్షుడు మంతుర్తి శ్రీకాంత్ యాదవ్ డిమాండ్



**ఎల్కతుర్తి జూన్ 25 తెలంగాణ ముచ్చట్లు:** మండల అభివృద్ధి పేరుతో ప్రభుత్వం వరుసగా జీవోలు జారీ చేస్తూ కోట్ల రూపాయల నిధులు మంజూరు చేస్తున్నప్పటికీ, వాటికి సంబంధించిన పనులు క్షేత్రస్థాయిలో ప్రారంభం కాకపోవడం పట్ల ప్రజల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోందని బీజేపీ మండల అధ్యక్షుడు మంతుర్తి శ్రీకాంత్ యాదవ్ అన్నారు. కాగితాలపై అభివృద్ధి చూపించడం కాకుండా ప్రజలకు కనిపించే విధంగా పనులు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

ఇటీవల తహసీల్దార్ కార్యాలయ నూతన భవనం, 100 అడుగుల రహదారి నిర్మాణం, వ్యవసాయ మార్కెట్ అభివృద్ధి, 50 పడకల ఆసుపత్రి నిర్మాణం, 13 కేవీ సబ్‌స్టేషన్ ఏర్పాటు వంటి పలు కీలక అభివృద్ధి పనులకు ప్రభుత్వం జీవోలు జారీ చేసి నిధులు మంజూరు చేసినప్పటికీ, ఇప్పటి వరకు పనులు ప్రారంభం కాలేదని ఆయన పేర్కొన్నారు.

జీవోలు విడుదలైన సమయంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సంబరాలు నిర్వహించి ప్రజలకు భారీ ఆశలు కల్పించారని, అయితే ఆ ఆశలు నెరవేరే పరిస్థితి కనిపించడం లేదని విమర్శించారు. అభివృద్ధి పనులు ఆలస్యం కావడంతో ప్రజలు నిరాశకు గురవుతున్నారని తెలిపారు.

ఈ సందర్భంగా శ్రీకాంత్ యాదవ్ మాట్లాడుతూ, హుస్నాబాద్ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న రాష్ట్ర బీసీ సంక్షేమ మరియు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ ప్రత్యేక చొరవ తీసుకుని జారీ చేసిన జీవోలకు అనుగుణంగా పనులు వెంటనే ప్రారంభమయ్యేలా చర్యలు చేపట్టాలని కోరారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసి అభివృద్ధి ఫలాలు ప్రజలకు అందేలా చూడాలని ఆయన డిమాండ్ చేశారు.

ప్రకటనలు, జీవోలు మాత్రమే కాకుండా వాటి అమలుపై కూడా ప్రభుత్వం దృష్టి సారించి ఎల్కతుర్తి మండల అభివృద్ధికి కట్టుబడి ఉందని నిరూపించుకోవాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు.

# విద్యుత్ తీగలతో సాగుకు అడ్డంకి.!

- ఫిర్యాదులు చేసినా స్పందించని విద్యుత్ శాఖ.
- రైతుల ఆవేదన.



**సత్తుపల్లి, జూన్ 25 (తెలంగాణ ముచ్చట్లు):** వేంసూరు మండలం భరణిపాడు గ్రామ శివారులోని బంచరాయి వైపు వ్యవసాయ భూములపై విద్యుత్ తీగలు ప్రమాదకరంగా కిందకు వేలాడుతుండటంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పర్వతాపురం వెళ్లే మార్గంలోని ఈ వ్యవసాయ చేలలో లూజుగా ఉన్న విద్యుత్ తీగల కారణంగా సాగు పనులు నిలిచిపోతున్నాయని రైతులు వాపోతున్నారు. రైతు షేక్ ఇబ్రహీం (బాలయ్య) మాట్లాడుతూ.. సమస్యపై పలుమార్లు విద్యుత్ శాఖ అధికారులకు, సిబ్బందికి ఫోన్ ద్వారా సమాచారం అందించినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. తీగలు చాలా కిందకు ఉండటంతో ట్రాక్టర్లు పొలాల్లోకి వెళ్లేందుకు డ్రైవర్లు నిరాకరిస్తున్నారని, దీంతో దుక్కి దున్నడం సహా వ్యవసాయ పనులు నిలిచిపోయాయని తెలిపారు. ప్రస్తుతం వర్షాకాలంలో సాగు పనులు చేపట్టాల్సిన సమయంలో ఈ పరిస్థితి రైతులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోందన్నారు. ప్రమాదం సంభవించే అవకాశం ఉన్నందున విద్యుత్ శాఖ అధికారులు వెంటనే స్పందించి కిందకు వేలాడుతున్న తీగలను సరిచేసి రైతుల ఇబ్బందులను తొలగించాలని కోరారు. గ్రామంలో ప్రమాదం జరగకముందే అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానిక రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# ఆప్ మాజీ అభ్యర్థి మృతి కలకలం

**రాజ్‌కోట్, జూన్ 25 (తెలంగాణ ముచ్చట్లు):** ఆమ్ ఆద్మీ పార్టీ మాజీ అభ్యర్థి నందని బోస్మియా అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన ఘటన గుజరాత్‌లో కలకలం రేపుతోంది. రాజ్‌కోట్‌లోని ఆమె అద్దె నివాసంలో ఉరివేసుకున్న స్థితిలో కనిపించడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. అయితే ఇది ఆత్మహత్య కాదని, హత్య జరిగి ఉండొచ్చని కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.



గతంలో జెట్‌పూర్-నవగఢ్ మున్సిపల్ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ తరఫున పోటీ చేసిన నందని ప్రస్తుతం వైద్య రంగానికి సంబంధించిన సంస్థలో ఉద్యోగం చేస్తున్నట్లు సమాచారం. రాజ్‌కోట్‌లోని ఆగమన్ సిటీ నివాస సముదాయంలోని ఐదో అంతస్తు ఫ్లాట్‌లో ఆమె నివసిస్తున్నారు. ఫోన్‌కు స్పందించకపోవడంతో కుటుంబ సభ్యులు వెళ్లి చూడగా ఆమె మృతదేహం కనిపించింది. నందని తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు జునాగఢ్‌కు చెందిన అస్లాం హుస్సేన్ సమాపై పోలీసులు విచారణ చేపట్టారు. అతనికి ఇప్పటికే వివాహం జరిగినప్పటికీ నందనితో కలిసి నివసిస్తున్నాడని కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఈ విషయమై ఇద్దరి మధ్య తరచూ వివాదాలు చోటుచేసుకునేవని పేర్కొన్నారు. అస్లాం తన కుమార్తెను శారీరకంగా, మానసికంగా వేధించేవాడని కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఆర్థికంగా కూడా ఇబ్బందులకు గురిచేశాడని, పలు సందర్భాల్లో ఒత్తిళ్లు తెచ్చాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. గతంలో నందనిపై దాడి జరిగిన ఘటనలో కూడా కేసు నమోదైందని కుటుంబ సభ్యులు తెలిపారు. ప్రస్తుతం అస్లాం కనిపించకుండా ఉండటంతో పోలీసులు అతని కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఈ ఘటనను అనుమానాస్పద మృతిగా నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. ప్రాథమిక వైద్య పరీక్షల్లో ఉరివేసుకోవడం వల్లే మరణం సంభవించినట్లు తేలినప్పటికీ పూర్తి వివరాలు ఇంకా రావాల్సి ఉంది. పోస్టుమార్టం పూర్తి నివేదిక, ఫోరెన్సిక్ పరీక్షల ఫలితాల ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు. ఇది ఆత్మహత్యా, హత్యా అనే అంశంపై ప్రస్తుతం ఎలాంటి తుది నిర్ణయానికి రాలేదని స్పష్టం చేశారు. దర్యాప్తు పూర్తయిన తర్వాతే ఘటనపై పూర్తి వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.







# ముల్కనూరులో రోడ్డు ప్రమాదం.. యువకుడికి తీవ్ర గాయాలు

**భీమదేవరపల్లి, జూన్ 25(తెలంగాణ ముచ్చట్లు):** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలోని ముల్కనూర్ గ్రామంలో ఎల్లమ్మ ఆలయం సమీపంలో గురువారం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. సిద్దిపేట డిపోకు చెందిన TG 36 Z 0067 ఆర్టీసీ బస్సు,ద్విచక్ర వాహనం ఢీకొనిన సంఘటనలో కరీంనగర్ జిల్లా మానకొండూర్‌కు చెందిన మామిళ్ల సందీప్ (25) తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న సందీప్‌తో పాటు అతని రెండున్నరేళ్ల కుమార్తె సహంచిక కూడా ఉన్నారు. ప్రమాదంలో సందీప్‌కు తీవ్ర గాయాలు కాగా, చిన్నారికి స్వల్ప గాయాలయ్యాయి.

సమాచారం అందుకున్న వెంటనే స్థానికులు, పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రులను 108 అంబులెన్స్ ద్వారా సమీప ఆసుపత్రికి తరలించారు.

ఈ ఘటనపై ముల్కనూర్ ఎస్సై రాజు మాట్లాడుతూ, ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి విచారణ కొనసాగిస్తున్నట్లు వెల్లడించారు.

# బ్రహ్మోస్ క్షిపణులతో మరింత శక్తివంతమైన వైమానిక దళం

- 40 సుఖోయ్ యుద్ధ విమానాలకు బ్రహ్మోస్ అనుసంధానం
- దూర లక్ష్యాలపై కచ్చితమైన దాడుల సామర్థ్యం పెంపు
- తదుపరి తరం క్షిపణుల అభివృద్ధిపై దృష్టి



**న్యూఢిల్లీ, జూన్ 25 (తెలంగాణ ముచ్చట్లు):** భారత వైమానిక దళం తన దీర్ఘ శ్రేణి దాడి సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేసింది. ఇప్పటికే 40 సుఖోయ్30 ఎంకేఐ యుద్ధ విమానాలకు బ్రహ్మోస్ సూపర్‌సోనిక్ క్రూయిజ్ క్షిపణులను అనుసంధానం చేయడం ద్వారా భూ, సముద్ర లక్ష్యాలపై అత్యంత కచ్చితత్వంతో దాడులు చేసే సామర్థ్యాన్ని పెంచుకుంది. వైమానిక దళంలో కీలక పాత్ర పోషిస్తున్న సుఖోయ్ యుద్ధ విమానాలు, బ్రహ్మోస్ క్షిపణుల కలయిక దేశ రక్షణ వ్యవస్థకు మరింత బలాన్ని చేకూరుస్తోంది. యుద్ధ విమానం పరిధి, క్షిపణి దాడి సామర్థ్యం కలిపి వేల కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను ఛేదించే శక్తిని అందిస్తున్నట్లు రక్షణ వర్గాలు పేర్కొంటున్నాయి.

సుమారు 2.5 టన్నుల బరువు కలిగిన వైమానిక బ్రహ్మోస్ క్షిపణిని ప్రత్యేకంగా సుఖోయ్30 ఎంకేఐ వేదికకు అనుగుణంగా రూపొందించారు. దీనివల్ల శత్రు లక్ష్యాలను సురక్షిత దూరం నుంచే ధ్వంసం చేసే అవకాశం లభిస్తోంది. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని బ్రహ్మోస్‌ఎన్‌జీ అనే తేలికపాటి నూతన తరం క్షిపణి అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. ఈ క్షిపణిని తేజస్, రఫేల్, భవిష్యత్తులో అభివృద్ధి చెందుతున్న అధునాతన యుద్ధ విమానాల్లో వినియోగించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నారు. అంతేకాకుండా భారత్, రష్యా సంయుక్తంగా అత్యంత వేగవంతమైన బ్రహ్మోస్2 హైపర్‌సోనిక్ క్షిపణి సాంకేతికత అభివృద్ధిపై కూడా పనిచేస్తున్నాయి. ఇది పూర్తయితే భారత సైనిక సామర్థ్యాలకు మరింత బలం చేకూరనుంది. దీర్ఘ శ్రేణి దాడి సామర్థ్యాన్ని పెంచేందుకు 800 కిలోమీటర్లకు పైగా పరిధి కలిగిన బ్రహ్మోస్ విస్తరిత శ్రేణి రూపాంతరం కూడా అభివృద్ధి దశలో ఉంది. ఈ పరిణామాలు భారత వైమానిక దళం నిరోధక శక్తిని, వ్యూహాత్మక సామర్థ్యాలను మరింత పెంచనున్నాయని రక్షణ నిపుణులు భావిస్తున్నారు.

# మచైల్‌కు మళ్లీ రహదారి అనుసంధానం

- కొత్త బేలీ వంతెనను అందుబాటులోకి తెచ్చిన బీఆర్‌ఓ
- మేఘ విస్ఫోటనం వల్ల తెగిపోయిన రహదారి పునరుద్ధరణ
- దూర ప్రాంత ప్రజలకు ఊరట




**జమ్మూ, జూన్ 25 (తెలంగాణ ముచ్చట్లు):** జమ్మూకశ్మీర్‌లోని దూర ప్రాంతమైన మచైల్‌కు రహదారి అనుసంధానాన్ని సరిహద్దు రహదారుల సంస్థ విజయవంతంగా పునరుద్ధరించింది. గులాబ్‌గఢ్-మచైల్ మార్గంలోని చిషోటి వద్ద 140 అడుగుల పొడవైన ప్రత్యేక బలపరిచిన బేలీ వంతెనను నిర్మించి రాకపోకలకు అందుబాటులోకి తీసుకువచ్చింది. గత ఏడాది ఆగస్టు 14న సంభవించిన భారీ మేఘ విస్ఫోటనం కారణంగా చిషోటి వద్ద ఉన్న పాత వంతెన పూర్తిగా కొట్టుకుపోయింది. దీంతో మచైల్ ప్రాంతానికి ఉన్న ఏకైక రహదారి సంబంధం తెగిపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రవాణా, అత్యవసర సేవలు, సరుకుల సరఫరాపై తీవ్ర ప్రభావం పడింది.

ఈ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని సరిహద్దు రహదారుల సంస్థ యుద్ధ ప్రాతిపదికన పునర్నిర్మాణ పనులు చేపట్టింది. క్లిష్ట భౌగోళిక పరిస్థితులు, ప్రతికూల వాతావరణాన్ని ఎదుర్కొంటూ కొత్త వంతెన నిర్మాణాన్ని పూర్తి చేసింది. దీంతో గులాబ్‌గఢ్-మచైల్ మధ్య రహదారి అనుసంధానం మళ్లీ పునరుద్ధరించబడింది. కొత్త వంతెనను వైట్ నైట్ కార్ప్స్ కమాండర్ లెఫ్టినెంట్ జనరల్ పి.కె. మిశ్రా వర్చువల్ విధానంలో ప్రారంభించి దేశానికి అంకితం చేశారు. కార్యక్రమంలో జమ్మూకశ్మీర్ శాసనసభ ప్రతిపక్ష నాయకుడు సునీల్ కుమార్ శర్మ, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. ఈ వంతెన అందుబాటులోకి రావడంతో మచైల్ ప్రాంత ప్రజలకు పెద్ద ఊరట లభించింది. విద్య, వైద్యం, నిత్యావసర వస్తువుల రవాణా, అత్యవసర సేవలు తిరిగి సాధారణ స్థితికి చేరుకోనున్నాయి. ప్రాంతీయ అభివృద్ధికి కూడా ఇది తోడ్పడనుంది. ప్రకృతి వైపరీత్యాల సమయంలో సరిహద్దు రహదారుల సంస్థ చూపిన చొరవ, ఇంజినీరింగ్ నైపుణ్యం మరోసారి రుజువైందని రక్షణ శాఖ అధికారులు పేర్కొన్నారు. దేశంలోని సుదూర ప్రాంతాలకు అనుసంధానం కల్పించడంలో ఇలాంటి మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు.

# బ్రిక్స్ ఇంధన మంత్రుల సమావేశానికి భారత్ ఆతిథ్యం

- గురుగ్రామ్‌లో 11వ బ్రిక్స్ ఇంధన మంత్రుల సమావేశం
- ఇంధన భద్రత, సహకారంపై సభ్య దేశాల ఏకాభిప్రాయం
- సంయుక్త ప్రకటన విడుదలతో సమావేశం ముగింపు



**గురుగ్రామ్, జూన్ 25 (తెలంగాణ ముచ్చట్లు):** బ్రిక్స్ అధ్యక్ష దేశంగా భారత్ ఆధ్వర్యంలో 11వ బ్రిక్స్ ఇంధన మంత్రుల సమావేశం గురుగ్రామ్‌లో నిర్వహించారు. బ్రిక్స్ సభ్య దేశాల ఇంధన మంత్రులు పాల్గొన్న ఈ సమావేశంలో ఇంధన భద్రత, సుస్థిర అభివృద్ధి, పరస్పర సహకారం వంటి కీలక అంశాలపై విస్తృతంగా చర్చించారు. సమావేశంలో సభ్య దేశాలు తమ తమ జాతీయ పరిస్థితులు, అభివృద్ధి ప్రాధాన్యతలు, ఇంధన విధానాలను గౌరవించడం అత్యంత ముఖ్యమని పునరుద్ఘాటించాయి. ప్రతి దేశం తన అవసరాలకు అనుగుణంగా ఇంధన రంగ అభివృద్ధి వ్యూహాలను అమలు చేసుకునే హక్కును గుర్తించాయి.

ప్రపంచ ఇంధన అవసరాలు, ఇంధన మార్పిడి ప్రక్రియ, పరిశుభ్రమైన ఇంధన వనరుల వినియోగం, ఇంధన ప్రాప్యత పెంపు వంటి అంశాలపై కూడా సభ్య దేశాలు అభిప్రాయాలు పంచుకున్నాయి. పరస్పర సహకారంతో ఇంధన రంగంలో సవాళ్లను ఎదుర్కోవాలని నిర్ణయించాయి. బ్రిక్స్ దేశాల మధ్య సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్యాల మార్పిడి, పరిశోధన, ఆవిష్కరణలకు ప్రాధాన్యం ఇవ్వాలని సమావేశంలో అభిప్రాయం వ్యక్తమైంది. అభివృద్ధి చెందుతున్న దేశాల ఇంధన అవసరాలను దృష్టిలో ఉంచుకుని సమతుల్య విధానాలు అవలంబించాలని సూచించారు.

సమావేశం ముగింపు సందర్భంగా 11వ బ్రిక్స్ ఇంధన మంత్రుల సంయుక్త ప్రకటనను ఆమోదించారు. ఇందులో సభ్య దేశాల ఉమ్మడి దృక్పథం, భవిష్యత్ కార్యాచరణ, ఇంధన రంగ సహకారంపై ఏకాభిప్రాయాన్ని ప్రతిబింబించారు. ఈ సమావేశం ద్వారా ఇంధన రంగంలో బ్రిక్స్ దేశాల మధ్య సహకారం మరింత బలోపేతం కానుందని అధికారులు పేర్కొన్నారు. ప్రపంచ ఇంధన రంగంలో స్థిరత్వం, సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనలో ఈ సమావేశం కీలకంగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

## మాదకద్రవ్యాల ముప్పు.. యువత భవిష్యత్తుకు సవాలు

ఆధునిక సమాజం ఎదుర్కొంటున్న అత్యంత ప్రమాదకరమైన సమస్యల్లో మాదకద్రవ్యాల దుర్వినియోగం ఒకటి. ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది ప్రజలు ఈ వ్యసనానికి బానిసలై తమ ఆరోగ్యాన్ని, కుటుంబ జీవితాన్ని, భవిష్యత్తును కోల్పోతున్నారు. ముఖ్యంగా యువతలో పెరుగుతున్న మాదకద్రవ్యాల వినియోగం దేశ భవిష్యత్తుపై ఆందోళన కలిగిస్తోంది. ఈ నేపథ్యంలో ప్రతి సంవత్సరం జూన్ 26న మాదకద్రవ్యాల దుర్వినియోగం మరియు అక్రమ రవాణాకు వ్యతిరేక అంతర్జాతీయ దినోత్సవాన్ని నిర్వహిస్తూ ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారు. ఈ దినోత్సవాన్ని ఐక్యరాజ్యసమితి 1987లో ప్రారంభించింది. మాదకద్రవ్యాల ఉత్పత్తి, అక్రమ రవాణా, విక్రయాలు మరియు వినియోగాన్ని అరికట్టేందుకు ప్రపంచ దేశాలు కలిసి పనిచేయాలనే ఉద్దేశంతో దీనిని నిర్వహిస్తున్నారు. ప్రతి ఏడాది ఒక ప్రత్యేక అంశాన్ని ఎంపిక చేసి ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు, విద్యాసంస్థలు, ఆరోగ్య సంస్థలు అవగాహన కార్యక్రమాలు చేపడుతుంటాయి. మాదకద్రవ్యాలపై పోరాటం కేవలం చట్ట అమలు సంస్థల బాధ్యత మాత్రమే కాదని, సమాజంలోని ప్రతి వ్యక్తి భాగస్వామి కావాలని ఈ దినోత్సవం గుర్తు చేస్తోంది.



ప్రస్తుతం మాదకద్రవ్యాల వ్యాపారం ప్రపంచవ్యాప్తంగా బిలియన్ల రూపాయల విలువైన అక్రమ వ్యాపారంగా మారింది. సరిహద్దులు దాటి రహస్య మార్గాల్లో మాదకద్రవ్యాలను తరలిస్తూ నేర ముఠాలు భారీ లాభాలు పొందుతున్నాయి. ఈ అక్రమ వ్యాపారం వెనుక అంతర్జాతీయ నేరగాళ్ల నెట్‌వర్క్‌లు పనిచేస్తున్నాయి. వీటి కారణంగా అనేక దేశాల్లో నేరాలు, హింసాత్మక ఘటనలు, సామాజిక సమస్యలు పెరుగుతున్నాయి. ముఖ్యంగా యువత ఈ ముఠాలకు సులభ లక్ష్యంగా మారుతోంది. స్నేహితుల ప్రలోభాలు, సామాజిక మాధ్యమాల ప్రభావం, ఒత్తిడితో కూడిన జీవనశైలి, తాత్కాలిక ఆనందం కోసం చేసే ప్రయత్నాలు యువతను మాదకద్రవ్యాల వైపు నడిపిస్తున్నాయి. కొందరు సరదాగా ప్రారంభించిన అలవాటు క్రమంగా వ్యసనంగా మారి వారి జీవితాలను అంధకారంలోకి నెట్టేస్తోంది. చదువులో వెనుకబడటం, కుటుంబాలకు దూరమవడం, మానసిక సమస్యలు ఎదుర్కోవడం వంటి పరిణామాలు కనిపిస్తున్నాయి.

మాదకద్రవ్యాల వినియోగం మానవ శరీరంపై తీవ్రమైన ప్రభావం చూపుతుంది. గుండె, మెదడు, ఊపిరితిత్తులు, కాలేయం వంటి అవయవాలు దెబ్బతినే ప్రమాదం ఉంటుంది. శారీరక బలహీనత, జ్ఞాపకశక్తి తగ్గడం, నిద్రలేమి, ఆకలి మందగించడం వంటి సమస్యలు తలెత్తుతాయి. దీర్ఘకాలంగా వినియోగిస్తే ప్రాణాంతక వ్యాధులు వచ్చే అవకాశాలు కూడా పెరుగుతాయి. శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యంపై కూడా తీవ్ర ప్రభావం ఉంటుంది. నిరాశ, ఆందోళన, కోపం, భయం, అనుమానాలు వంటి మానసిక సమస్యలు పెరుగుతాయి. కొంతమంది వ్యక్తులు వాస్తవ ప్రపంచానికి దూరమై భ్రమల్లో జీవించడం ప్రారంభిస్తారు. కొన్ని సందర్భాల్లో ఆత్మహత్యా ఆలోచనలు కూడా కలుగుతాయి. అందువల్ల మాదకద్రవ్యాల సమస్యను కేవలం ఆరోగ్య సమస్యగా కాకుండా సామాజిక సమస్యగా చూడాల్సిన అవసరం ఉంది.

మాదకద్రవ్యాల వ్యసనం కుటుంబాలపై కూడా తీవ్ర ప్రభావం చూపుతోంది. వ్యసనానికి బానిసైన వ్యక్తి కుటుంబ సభ్యులతో విభేదాలు పెంచుకోవడం, ఆర్థిక ఇబ్బందులు సృష్టించడం, కుటుంబ బంధాలను దెబ్బతీయడం వంటి సమస్యలు ఎదురవుతున్నాయి. అనేక కుటుంబాలు తమ పిల్లలను ఈ వ్యసనం నుంచి బయటకు తీసుకురావడానికి తీవ్రంగా శ్రమిస్తున్నాయి. కొన్ని సందర్భాల్లో కుటుంబాలు ఆర్థికంగా, మానసికంగా పూర్తిగా కుంగిపోయే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఈ సమస్యను అరికట్టడంలో విద్యాసంస్థల పాత్ర అత్యంత కీలకం. పాఠశాలలు, కళాశాలల్లో మాదకద్రవ్యాల వల్ల కలిగే నష్టాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. విద్యార్థులకు ఆరోగ్యకరమైన జీవనశైలి, క్రీడలు, సృజనాత్మక కార్యకలాపాల పట్ల ఆసక్తి పెంచాలి. ఉపాధ్యాయులు మరియు తల్లిదండ్రులు పిల్లల ప్రవర్తనలో వచ్చే మార్పులను గమనిస్తూ వారికి సరైన మార్గదర్శనం చేయాలి.

ప్రభుత్వాలు కూడా మాదకద్రవ్యాల నిర్మూలన కోసం పలు చర్యలు చేపడుతున్నాయి. ప్రత్యేక దాడులు, సరిహద్దుల పర్యవేక్షణ, అక్రమ రవాణాదారులపై కఠిన చర్యలు, పునరావాస కేంద్రాల ఏర్పాటు వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. అయినప్పటికీ చట్టపరమైన చర్యలతో పాటు ప్రజల్లో అవగాహన పెరగడం కూడా చాలా అవసరం. ప్రజల సహకారం లేకుండా ఈ సమస్యకు పూర్తిస్థాయిలో పరిష్కారం లభించడం కష్టం. మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణం ప్రతి ఒక్కరి బాధ్యత. యువత తమ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని వ్యసనాలకు దూరంగా ఉండాలి. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు కలిసి పనిచేసినప్పుడే ఈ సమస్యను సమర్థంగా ఎదుర్కోవచ్చు. జూన్ 26 అంతర్జాతీయ దినోత్సవం మాదకద్రవ్యాల వల్ల కలిగే ప్రమాదాలను గుర్తుచేస్తూ ఆరోగ్యవంతమైన, సురక్షితమైన, వ్యసన రహిత సమాజ నిర్మాణానికి అందరినీ చైతన్యపరిచే సందర్భంగా నిలుస్తోంది.

## చిత్రహింసలకు వ్యతిరేకంగా ప్రపంచ స్వరం

మానవ హక్కులకు అత్యంత విరుద్ధమైన చర్యల్లో చిత్రహింసలు ఒకటి. వ్యక్తుల నుంచి సమాచారం రాబట్టడం, ఒప్పుకోలు పొందడం లేదా భయపెట్టడం కోసం శారీరకంగా, మానసికంగా వేధించడం ప్రపంచవ్యాప్తంగా ఇప్పటికీ కొన్ని ప్రాంతాల్లో కొనసాగుతూనే ఉంది. ఇలాంటి అమానవీయ చర్యలను పూర్తిగా నిర్మూలించాలనే లక్ష్యంతో ప్రతి సంవత్సరం జూన్ 26న హింసాత్మక చిత్రహింసల బాధితులకు మద్దతు తెలిపే అంతర్జాతీయ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.



ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో జరుపుకునే ఈ దినోత్సవం చిత్రహింసలకు గురైన బాధితుల పట్ల సంఘీభావం ప్రకటించడంతో పాటు వారి హక్కులను పరిరక్షించాల్సిన అవసరాన్ని గుర్తు చేస్తుంది. ప్రపంచవ్యాప్తంగా అనేక మంది వ్యక్తులు వివిధ కారణాలతో చిత్రహింసలకు గురవుతుండగా, వారిలో చాలామంది జీవితాంతం శారీరక, మానసిక వేదనను అనుభవిస్తున్నారు. ఈ బాధితులకు న్యాయం, పునరావాసం, వైద్య సహాయం అందించాలనే సందేశాన్ని ఈ దినోత్సవం ముందుకు తీసుకెళ్తుంది. చిత్రహింసలు కేవలం శారీరక హింసకు మాత్రమే పరిమితం కావు. మానసిక వేధింపులు, అవమానకర ప్రవర్తన, బెదిరింపులు, ఒంటరిగా నిర్బంధించడం వంటి చర్యలు కూడా చిత్రహింసలుగానే పరిగణించబడతాయి. ఇవి వ్యక్తి ఆత్మగౌరవాన్ని దెబ్బతీసి జీవితాంతం వెంటాడే మానసిక గాయాలను మిగులుస్తాయి. బాధితులు సాధారణ జీవితానికి తిరిగి రావడానికి చాలా కాలం పడుతుంది.

ప్రపంచ మానవ హక్కుల చరిత్రలో చిత్రహింసలను నిషేధించేందుకు అనేక చట్టాలు, ఒప్పందాలు అమలులోకి వచ్చాయి. 1984లో ఐక్యరాజ్యసమితి చిత్రహింసలకు వ్యతిరేక ఒప్పందాన్ని ఆమోదించింది. ఈ ఒప్పందం ప్రకారం ఏ పరిస్థితుల్లోనూ చిత్రహింసలను సమర్థించరాదని స్పష్టం చేసింది. అనంతరం అనేక దేశాలు తమ చట్టాల్లో మార్పులు చేసి కఠిన నిబంధనలు అమలు చేస్తున్నాయి. అయినప్పటికీ ప్రపంచంలోని కొన్ని ప్రాంతాల్లో యుద్ధాలు, రాజకీయ ఘర్షణలు, తీవ్రవాదం, సామాజిక అస్థిరత కారణంగా చిత్రహింసల ఘటనలు వెలుగుచూస్తూనే ఉన్నాయి. మానవ హక్కుల సంస్థలు ఇలాంటి సంఘటనలను గుర్తించి బాధితులకు సహాయం అందించేందుకు కృషి చేస్తున్నాయి. చిత్రహింసలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాలపై ఒత్తిడి తెస్తున్నాయి. చిత్రహింసలకు గురైన వ్యక్తులు కేవలం శారీరక గాయాలతోనే కాకుండా తీవ్రమైన మానసిక ఒత్తిడితో కూడా బాధపడుతుంటారు. భయం, నిరాశ, నిద్రలేమి, ఆందోళన, సామాజిక జీవితం నుంచి దూరమవడం వంటి సమస్యలు వారిని వెంటాడుతుంటాయి. అందువల్ల వారికి వైద్య సహాయం మాత్రమే కాకుండా మానసిక పునరావాసం కూడా ఎంతో అవసరం.

బాధితుల పునరావాసంలో కుటుంబ సభ్యులు, సామాజిక సంస్థలు, ప్రభుత్వ యంత్రాంగం కీలక పాత్ర పోషించాలి. వారికి న్యాయం అందించడంతో పాటు సమాజంలో గౌరవప్రదమైన స్థానం కల్పించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలి. బాధితులు తమ జీవితాలను తిరిగి నిర్మించుకునేలా అవసరమైన అవకాశాలు కల్పించడం సమాజ బాధ్యతగా గుర్తించాలి. విద్యాసంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, మానవ హక్కుల సంఘాలు ఈ అంశంపై విస్తృతంగా అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. మానవ హక్కుల పరిరక్షణ, వ్యక్తిగత గౌరవం, చట్టాల పట్ల గౌరవం వంటి విలువలను చిన్నప్పటి నుంచే విద్యార్థులకు బోధించాలి. అప్పుడు మాత్రమే హింసకు బదులుగా మానవతా దృక్పథం పెరుగుతుంది.

చిత్రహింసలను అరికట్టడం కోసం ప్రభుత్వాలు పారదర్శక దర్యాప్తు విధానాలు, బాధ్యతాయుత పరిపాలన, మానవ హక్కుల పరిరక్షణ వ్యవస్థలను మరింత బలోపేతం చేయాలి. చట్టాన్ని అమలు చేసే సంస్థలకు కూడా మానవ హక్కులపై ప్రత్యేక శిక్షణ అందించడం అవసరం. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతి వ్యక్తి గౌరవం, భద్రతకు ప్రాధాన్యం ఇవ్వడం అత్యంత కీలకం. హింసాత్మక చిత్రహింసల బాధితులకు మద్దతు తెలిపే అంతర్జాతీయ దినోత్సవం మానవత్వానికి అద్దం పట్టే రోజు. చిత్రహింసలకు వ్యతిరేకంగా ప్రపంచం ఒక్కటిగా నిలబడాలని, బాధితులకు న్యాయం జరగాలని, ప్రతి వ్యక్తి గౌరవంగా జీవించే సమాజ నిర్మాణం కోసం కృషి చేయాలని ఈ దినోత్సవం పిలుపునిస్తోంది. మానవ హక్కుల పరిరక్షణే నాగరిక సమాజానికి అసలైన గుర్తింపు అనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాల్సిన అవసరం ఉంది.

# క్రీడలు, కళలతో వ్యసనాలకు చెక్

ప్రపంచవ్యాప్తంగా యువత ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల్లో వ్యసనాలు ఒకటిగా మారాయి. ఒకప్పుడు మాదకద్రవ్యాలు, మద్యం, పొగాకు వంటి హానికర అలవాట్లకే వ్యసనాలు పరిమితమయ్యేవి. కానీ ప్రస్తుతం పరిస్థితులు మారిపోయాయి. మొబైల్ ఫోన్‌లు, ఆన్‌లైన్ ఆటలు, సామాజిక మాధ్యమాలు, జూదం వంటి కొత్త రకాల వ్యసనాలు కూడా యువత జీవితాలను ప్రభావితం చేస్తున్నాయి. ఈ వ్యసనాలు వ్యక్తిగత ఆరోగ్యాన్ని మాత్రమే కాదు, కుటుంబ వ్యవస్థను, విద్యను, ఉపాధిని, సమాజ అభివృద్ధిని కూడా దెబ్బతీస్తున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో యువత శక్తిని సానుకూల మార్గంలో మలచగల రెండు ముఖ్యమైన సాధనాలు క్రీడలు, కళలు. వ్యసనాలు ఒక్కరోజులో ఏర్పడవు. వాటి వెనుక అనేక సామాజిక, ఆర్థిక, మానసిక కారణాలు ఉంటాయి. ఒత్తిడి, నిరాశ, ఒంటరితనం, కుటుంబ సమస్యలు, స్నేహితుల ప్రభావం, లక్ష్యాల లేమి వంటి అంశాలు యువతను వ్యసనాల వైపు నడిపిస్తాయి. జీవితంలో ఆనందం కోసం, సమస్యల నుంచి తాత్కాలిక ఉపశమనం కోసం కొందరు వ్యసనాలను ఆశ్రయిస్తారు. అయితే అవి క్షణిక ఆనందాన్ని ఇచ్చినా దీర్ఘకాలంలో జీవితాన్ని నాశనం చేస్తాయి. ఈ దుష్పరిణామాలను అరికట్టాలంటే యువతకు ప్రత్యామ్నాయ మార్గాలను చూపించాల్సిన అవసరం ఉంది.



క్రీడలు యువత వ్యక్తిత్వ వికాసానికి అత్యంత ప్రభావవంతమైన సాధనం. క్రీడల ద్వారా శారీరక దృఢత్వం పెరగడమే కాకుండా మానసికంగా కూడా బలపడే అవకాశం ఉంటుంది. ఒక ఆటగాడు విజయాన్ని సాధించాలంటే క్రమశిక్షణ, పట్టుదల, సమయపాలన, కష్టపడే తత్వం అవసరం. ఈ లక్షణాలు క్రీడా మైదానంలో మాత్రమే కాకుండా జీవితంలోని ప్రతి రంగంలో ఉపయోగపడతాయి. అందుకే క్రీడలను జీవిత పాఠశాలగా అభివర్ణిస్తారు. నేటి యువతలో చాలా మంది ఖాళీ సమయాన్ని మొబైల్ ఫోన్‌లతో గడుపుతున్నారు. గంటల తరబడి తెర ముందు గడపడం వల్ల శారీరక చలనం తగ్గిపోతోంది. ఫలితంగా ఆరోగ్య సమస్యలు, మానసిక ఒత్తిడి, సామాజిక సంబంధాల లోపం వంటి సమస్యలు పెరుగుతున్నాయి. ఇదే సమయాన్ని క్రీడలకు కేటాయిస్తే శరీరం చురుకుగా మారడమే కాకుండా మానసిక ప్రశాంతత కూడా లభిస్తుంది. ఆటల ద్వారా కొత్త స్నేహాలు ఏర్పడతాయి. జట్టు భావన పెరుగుతుంది. పరస్పర సహకారం, నాయకత్వ లక్షణాలు అభివృద్ధి చెందుతాయి. క్రీడలు యువతలో ఆత్మవిశ్వాసాన్ని పెంచడంలో కూడా కీలక పాత్ర పోషిస్తాయి. గెలుపు, ఓటమి రెండింటినీ సమానంగా స్వీకరించడం క్రీడల ద్వారా నేర్చుకుంటారు. ప్రతి ఓటమి తర్వాత మళ్లీ ప్రయత్నించాలనే ధైర్యం పెరుగుతుంది. ఈ లక్షణం జీవితంలో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కొనే శక్తిని ఇస్తుంది. వ్యసనాలకు లోనయ్యే వ్యక్తుల్లో కనిపించే మానసిక బలహీనతలను క్రీడలు తగ్గించగలవు.

కళలు కూడా యువతను వ్యసనాల నుంచి దూరంగా ఉంచడంలో సమానంగా ఉపయోగపడతాయి. సంగీతం, నృత్యం, చిత్రలేఖనం, నాటకం, రచన, శిల్పకళ వంటి రంగాలు వ్యక్తిలోని సృజనాత్మకతను వెలికితీస్తాయి. మనసులోని భావాలను వ్యక్తపరచడానికి కళలు ఒక అద్భుతమైన వేదికగా నిలుస్తాయి. చాలామంది యువత ఒత్తిడి, నిరాశ, ఆందోళన కారణంగా వ్యసనాల వైపు వెళ్లిన సందర్భాలు కనిపిస్తాయి. కానీ కళల ద్వారా ఆ భావోద్వేగాలను సృజనాత్మకంగా వ్యక్తపరచే అవకాశం లభిస్తుంది. సంగీతం మానసిక ప్రశాంతతను అందించగల అత్యంత ప్రభావవంతమైన కళారూపం. అనేక పరిశోధనల్లో సంగీతం ఒత్తిడిని తగ్గించడంలో, ఆందోళనను నియంత్రించడంలో ఉపయోగపడుతుందని తేలింది. అలాగే చిత్రలేఖనం, నృత్యం, నాటక ప్రదర్శనలు వ్యక్తిలోని ప్రతిభను వెలికితీసి ఆత్మవిశ్వాసాన్ని పెంచుతాయి. కళల పట్ల ఆసక్తి ఉన్న యువత సమయాన్ని సృజనాత్మక కార్యక్రమాల్లో గడుపుతారు. ఫలితంగా వ్యసనాలకు దూరంగా ఉండే అవకాశం ఎక్కువగా ఉంటుంది.

నేటి విద్యా వ్యవస్థలో మార్కులపై మాత్రమే దృష్టి కేంద్రీకృతమవుతోంది. పిల్లల ప్రతిభను కేవలం పరీక్షల ఫలితాలతో కొలవడం సరైన విధానం కాదు. క్రీడలు, కళలు కూడా విద్యలో భాగమనే విషయాన్ని గుర్తించాలి. పాఠశాలలు, కళాశాలలు క్రీడా మైదానాలు, కళా వేదికలను అభివృద్ధి చేసి విద్యార్థులకు విస్తృత అవకాశాలు కల్పించాలి. వార్షికోత్సవాలు, క్రీడా పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు కేవలం వినోదం కోసం కాకుండా వ్యక్తిత్వ వికాసానికి అవసరమైన వేదికలుగా మారాలి. తల్లిదండ్రుల పాత్ర కూడా ఈ విషయంలో చాలా కీలకం. పిల్లలు చదువులో రాణించాలనే ఆశ సహజమే. అయితే కేవలం చదువులకే పరిమితం చేయకుండా వారి అభిరుచులను గుర్తించి ప్రోత్సహించాలి. క్రీడలు ఆడితే సమయం వృథా అవుతుందని, కళలపై దృష్టి పెడితే చదువు దెబ్బతింటుందని భావించడం సరైనది కాదు. వాస్తవానికి క్రీడలు, కళలు పిల్లల్లో ఏకాగ్రతను, ఆత్మవిశ్వాసాన్ని పెంచి చదువులో కూడా మెరుగైన ఫలితాలకు దోహదపడతాయి.

ప్రభుత్వాలు కూడా యువత కోసం మరిన్ని క్రీడా మైదానాలు, ఇండోర్ స్టేడియాలు, కళా కేంద్రాలు ఏర్పాటు చేయాలి. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభ కలిగిన యువతకు తగిన అవకాశాలు కల్పించాలి. క్రీడా అకాడమీలు, సంగీత పాఠశాలలు, కళా శిక్షణ కేంద్రాలు విస్తరించాలి. ప్రతి మండలంలో యువజన కేంద్రాలు ఏర్పాటు చేసి యువతను సృజనాత్మక కార్యకలాపాల వైపు మళ్లించాలి. వ్యసనాలను అరికట్టేందుకు కేవలం చట్టాలు, శిక్షలు మాత్రమే సరిపోవు. యువతకు ప్రత్యామ్నాయంగా ఆరోగ్యకరమైన, సృజనాత్మకమైన మార్గాలను అందించాలి. క్రీడలు, కళలు అలాంటి మార్గాల్లో అత్యంత ప్రభావవంతమైనవి. ఇవి వ్యక్తిని శారీరకంగా, మానసికంగా, సామాజికంగా బలోపేతం చేస్తాయి. యువతలోని అపార శక్తిని దేశాభివృద్ధికి ఉపయోగపడేలా మలుస్తాయి.

దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉంటుంది. ఆ యువత వ్యసనాలకు బానిసలైతే సమాజం ముందుకు సాగడం కష్టమవుతుంది. కానీ అదే యువత క్రీడలు, కళల ద్వారా తమ ప్రతిభను చాటుకుంటే దేశానికి అమూల్యమైన సంపదగా మారుతుంది. అందుకే ప్రతి కుటుంబం, ప్రతి విద్యాసంస్థ, ప్రతి ప్రభుత్వం క్రీడలు, కళలకు ప్రాధాన్యం ఇవ్వాలి. వ్యసన రహిత, ఆరోగ్యవంతమైన, సృజనాత్మక సమాజ నిర్మాణానికి క్రీడలు, కళలే శాశ్వత పరిష్కారమని గుర్తించాల్సిన సమయం ఆసన్నమైంది.

# ‘ఓజీ 2’ పనులు షురూ.. పవన్‌తో సుజీత్ వీడియో వైరల్




పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా, దర్శకుడు సుజీత్ తెరకెక్కించిన గ్యాంగ్‌స్టర్ డ్రామా ‘ఓజీ’కు కొనసాగింపుగా రానున్న‘ఓజీ 2’ పనులు అధికారికంగా ప్రారంభమయ్యాయి. ఈ విషయాన్ని వెల్లడిస్తూ చిత్రబృందం గురువారం ఒక ప్రత్యేక వీడియోను సామాజిక మాధ్యమాల్లో విడుదల చేసింది. ‘ఓజీ యూనివర్స్ ప్రారంభం’ అనే భావాన్ని తెలియజేస్తూ విడుదల చేసిన ఈ వీడియో ప్రస్తుతం అభిమానుల్లో భారీ ఉత్సాహాన్ని రేకెత్తిస్తోంది. “గంభీరమైన కథ సిద్ధమవుతోంది.. తుపాను రాకముందు నిశ్శబ్దం ఉంటుంది” అనే శక్తివంతమైన సందేశంతో వచ్చిన ఈ అప్‌డేట్‌కి మంచి స్పందన లభిస్తోంది.

విడుదలైన వీడియోలో దర్శకుడు సుజీత్‌తో కలిసి పవన్ కళ్యాణ్ కథ, స్క్రిప్ట్‌కు సంబంధించిన అంశాలపై చర్చిస్తున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి. చివర్లో పవన్ కళ్యాణ్ “నేను సిద్ధం” అని చెప్పడం అభిమానులను మరింత ఉత్సాహపరుస్తోంది. దీంతో ‘ఓజీ 2’ చిత్రీకరణ త్వరలోనే ప్రారంభం కానుందనే సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఇప్పటికే మొదటి భాగం ద్వారా సృష్టించిన గ్యాంగ్‌స్టర్ ప్రపంచాన్ని ఈసారి మరింత విస్తృత స్థాయిలో, కొత్త మలుపులతో చూపించేందుకు చిత్రబృందం సిద్ధమవుతున్నట్లు సినీ వర్గాల్లో చర్చ సాగుతోంది.
ఈ భారీ ప్రాజెక్ట్‌ను డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై నిర్మాత డీవీవీ దానయ్య నిర్మిస్తున్నారు. తొలి భాగానికి సంగీతం అందించిన తమన్ ఈ సీక్వెల్‌కూ సంగీత దర్శకుడిగా కొనసాగనున్నట్లు సమాచారం. పవన్ కళ్యాణ్ ప్రస్తుతం రాజకీయ బాధ్యతలతో బిజీగా ఉన్నప్పటికీ, ‘ఓజీ 2’ కోసం సమయం కేటాయించడంతో అభిమానుల్లో ఆనందం నెలకొంది. మొదటి భాగం తెరపై చూపించిన తీవ్రత, శైలి, గ్యాంగ్‌స్టర్ వాతావరణాన్ని మించి ఈ సీక్వెల్ ఉండబోతోందనే అంచనాలు ఇప్పటికే పెరిగాయి. దీంతో ‘ఓజీ 2’పై సినీ వర్గాలతో పాటు అభిమానుల్లోనూ భారీ ఆసక్తి నెలకొంది.



# బాక్సాఫీస్‌లో జోరు కొనసాగిస్తున్న మీనాక్షి చౌదరి..

ప్రస్తుతం తెలుగు చిత్రసీమలో అత్యంత డిమాండ్ ఉన్న హీరోయిన్లలో మీనాక్షి చౌదరి పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. ఇటీవల ఆమె నటించిన సినిమాలన్నీ వరుసగా విజయం సాధిస్తూ బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లు రాబడుతున్నాయి. దీంతో టాలీవుడ్‌లో ఆమె క్రేజ్ మరింత పెరిగింది.
2024లో విడుదలైన ‘లక్కీ భాస్కర్’ సినిమా వంద కోట్లకు పైగా వసూళ్లు సాధించి మంచి విజయాన్ని నమోదు చేసింది.
అనంతరం వెంకటేష్‌తో కలిసి నటించిన ‘సంక్రాంతికి వస్తున్నాం’ చిత్రం ఏకంగా రూ.350 కోట్లకు పైగా కలెక్షన్లు రాబట్టి సంచలనం సృష్టించింది. ఈ విజయాలతో మీనాక్షి కెరీర్‌లో ఇది ఇప్పటివరకు అత్యంత పెద్ద హిట్‌గా నిలిచింది.
తాజాగా ఈ ఏడాది సంక్రాంతి సీజన్‌లో విడుదలైన ‘అనగనగా ఒక రాజు’ చిత్రం కూడా రూ.100 కోట్లకు పైగా వసూళ్లు సాధించి మరో విజయాన్ని ఆమె ఖాతాలో వేసింది. వరుస విజయాలతో మీనాక్షి చౌదరి టాలీవుడ్‌లో బ్యాంకబుల్ హీరోయిన్‌గా మారిపోయిందని ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి.
ఇక ప్రస్తుతం ఆమె అక్కినేని నాగార్జునతో కలిసి నటిస్తున్న కొత్త చిత్రం ‘వృషకర్మ’ షూటింగ్‌లో బిజీగా ఉంది. హారర్ థ్రిల్లర్ జానర్‌లో రూపొందుతున్న ఈ సినిమాను ‘విరూపాక్ష’ ఫేమ్ కార్తీక్ దండు దర్శకత్వం వహిస్తున్నారు. ఈ ప్రాజెక్ట్‌పై కూడా మంచి అంచనాలు నెలకొన్నాయి.
షూటింగ్ మధ్యలో మీనాక్షి ఇటీవల నేపాల్ వెకేషన్‌కు వెళ్లి అక్కడి ప్రకృతి అందాలను ఆస్వాదించింది. ఆ క్షణాలను ఫోటోల రూపంలో సోషల్ మీడియాలో పంచుకోవడంతో అవి ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతున్నాయి. వరుస విజయాలు, క్రేజీ ప్రాజెక్టులతో మీనాక్షి చౌదరి టాలీవుడ్‌లో తన స్థానాన్ని మరింత బలపరుచుకుంటోంది.




# మిర్జాపూర్ ఇప్పుడు సినిమాగా..

హైదరాబాద్, జూన్ 25 (డిజైనర్ టెక్ గురు ప్రతినిధి): ఓటీటీలో మూడు సీజన్ల పాటు ప్రేక్షకులను కట్టిపడేసిన ప్రముఖ క్రైమ్ డ్రామా సిరీస్ ‘మిర్జాపూర్’ ఇప్పుడు వెండితెరపై భారీ సినిమాగా రూపుదిద్దుకుంటోంది. అమెజాన్ ప్రైమ్ వీడియోలో విశేష ప్రజాదరణ పొందిన ఈ సిరీస్‌ను ఇప్పుడు **‘మిర్జాపూర్: ది మూవీ’ పేరుతో థియేటర్లలో విడుదల చేయడానికి చిత్రబృందం సిద్ధమైంది. ఈ సందర్భంగా విడుదలైన అధికారిక టీజర్‌తో సినిమాపై అంచనాలు ఒక్కసారిగా పెరిగాయి. టీజర్‌లో పంకజ్ త్రిపాఠి మళ్లీ కలీన్ భయ్యా, అలీ ఫజల్ గుడ్డు భయ్యా, దివ్యేందు మున్నా భయ్యా పాత్రల్లో తిరిగి కనిపించడం అభిమానుల్లో ఉత్సాహాన్ని రేకెత్తించింది. గతంలో వీరు సృష్టించిన క్రైమ్ ప్రపంచాన్ని మరోసారి పెద్ద తెరపై చూపించేందుకు మేకర్స్ భారీగా ప్లాన్ చేసినట్లు స్పష్టమవుతోంది. వీరితో పాటు రవి కిషన్, అలాగే వెబ్ సిరీస్‌తో గుర్తింపు పొందిన జితేంద్ర కుమార్ కీలక పాత్రల్లో నటించనుండటం సినిమాకు మరింత బలాన్ని ఇచ్చింది. రెండు నిమిషాలకుపైగా ఉన్న ఈ టీజర్‌లో పాత జ్ఞాపకాలను గుర్తు చేస్తూనే, మరింత తీవ్రమైన యాక్షన్ సన్నివేశాలు, శక్తివంతమైన డైలాగులు చూపించారు. ఈసారి కేవలం గద్దె కోసం మాత్రమే కాకుండా అధికారం కోసం జరిగే పెద్ద పోరాటమే కథ ప్రధానాంశమని టీజర్ ద్వారా స్పష్టమవుతోంది. క్రైమ్, రాజకీయాలు, ప్రతీకారం కలిసిన ఈ ప్రపంచాన్ని మరింత విస్తృతంగా చూపించనున్నట్లు తెలుస్తోంది. ఈ భారీ చిత్రం సెప్టెంబర్ 4న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. హిందీతో పాటు ఇతర భాషల్లోనూ విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తుండటం గమనార్హం. ఓటీటీలో సంచలనం సృష్టించిన ఈ కథ ఇప్పుడు సినిమాగా ఎంత ప్రభావం చూపుతుందోనని ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది.

# స్వేచ్ఛ అంటే బట్టలు కాదు.. అభిప్రాయానికి విలువ రావాలి: సునీత



ప్రముఖ నేపథ్య గాయని సునీత ఇటీవల ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో మహిళల స్వేచ్ఛ, వస్త్రధారణ, సినిమా సామాజిక బాధ్యత వంటి అంశాలపై చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. సమాజంలో జరిగే విషయాలనే సినిమాల్లో చూపిస్తున్నామని దర్శక నిర్మాతలు చెప్పే వాదనను ఆమె ప్రశ్నించారు. కమర్షియల్ సినిమా అయినా, ఇతర రకాల సినిమాలు అయినా సమాజం పట్ల కొంత బాధ్యతతో ఉండాలని సునీత అభిప్రాయపడ్డారు. సమాజంలో కనిపించే ప్రతిదాన్ని యథాతథంగా చూపించడం మాత్రమే కళాత్మక స్వేచ్ఛ కాదని, దానికి ఒక దిశా నిర్దేశం, బాధ్యత కూడా ఉండాలని ఆమె సూచించారు.
మహిళల స్వేచ్ఛ పేరుతో ఇటీవలి కాలంలో విస్తృతంగా వినిపిస్తున్న “నా శరీరం.. నా ఇష్టం” అనే నినాదంపై కూడా సునీత ప్రాయోగిక కోణంలో స్పందించారు. అమ్మాయిలు తమకు నచ్చిన బట్టలు వేసుకోవడం వారి ఇష్టమే అయినప్పటికీ, దానిని సమాజంలో పూర్తిస్థాయి స్వేచ్ఛగా నిర్వచించడం సరైన కోణం కాదని ఆమె అన్నారు. ఎవరి ఇష్టం వారిదే అయినా, చుట్టూ ఉన్న పరిస్థితులు ఎంతవరకు సురక్షితంగా ఉన్నాయో కూడా ఆలోచించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. కేవలం బట్టలు, అలవాట్లు లేదా బయటి ప్రవర్తనతో సమానత్వాన్ని కొలవడం తగదని, నిజమైన సమానత్వం అంటే ఒక మహిళ తన అభిప్రాయం చెప్పినప్పుడు దానికి సమాజం, కుటుంబం, ముఖ్యంగా పురుషులు ఎంత గౌరవం ఇస్తున్నారన్నదే అసలు ప్రశ్న అని సునీత అభిప్రాయపడ్డారు. సినిమాల్లో మహిళా పాత్రల చిత్రీకరణ, మహిళల వ్యక్తిగత నిర్ణయాల గురించి కూడా సునీత పరోక్షంగా ప్రస్తావించారు. అవును అనాలా, వద్దనాలా అనేది పూర్తిగా వ్యక్తిగత నిర్ణయమని, ఎవరిపైనా బలవంతం ఉండకూడదని ఆమె స్పష్టం చేశారు. ఈ చర్చ కేవలం సినిమా రంగానికి మాత్రమే పరిమితం కాదని, సమాజంలో ఉన్న ప్రతి అమ్మాయి, ప్రతి మహిళ ఎదుర్కొనే వాస్తవ పరిస్థితుల గురించే తాను మాట్లాడుతున్నానని పేర్కొన్నారు. మహిళల స్వేచ్ఛ అనేది బాహ్య ప్రదర్శనలో కాకుండా, వారి మాటకు విలువ రావడంలో, వారి నిర్ణయాలను గౌరవించడంలో ఉండాలని సునీత చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం విస్తృత చర్చకు దారితీశాయి.

# అవతార్ 3 ఓటీటీలోకి..




హాలీవుడ్ విజనరీ దర్శకుడు జేమ్స్ కామెరాన్ సృష్టించిన విజువల్ వండర్ ‘అవతార్: ఫైర్ అండ్ యాష్’*ఎట్టకేలకు ఓటీటీ ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ప్రపంచవ్యాప్తంగా భారీ అంచనాల మధ్య విడుదలై బాక్సాఫీస్ వద్ద సత్తా చాటిన ఈ చిత్రం, ఇప్పుడు జియోహాట్‌స్టార్ వేదికగా స్ట్రీమింగ్ అవుతోంది. బుధవారం సాయంత్రం నుంచే ఈ సినిమా అందుబాటులోకి వచ్చినట్లు సమాచారం. ఇంగ్లీష్‌తో పాటు తెలుగు, హిందీ, తమిళం, మలయాళం, కన్నడ భాషల్లోనూ ఈ చిత్రాన్ని వీక్షించవచ్చు. ‘అవతార్’ ఫ్రాంచైజీలో మూడో భాగంగా వచ్చిన ఈ సినిమాలో మరోసారి దర్శకుడు జేమ్స్ కామెరాన్ ప్రేక్షకులను పాండోరా ప్రపంచంలోకి తీసుకెళ్లారు. మొదటి భాగంలో అడవుల అందాలను, రెండో భాగంలో సముద్ర గర్భ రహస్యాలను చూపించిన ఆయన.. ఈసారి ‘యాష్ పీపుల్’ అనే కొత్త నావి తెగను పరిచయం చేశారు. బూడిదతో ముడిపడిన ఈ తెగ కథలో కీలక మలుపులు తీసుకువస్తుందని, వీరి పాత్రల చుట్టూనే ఈ భాగం ప్రధానంగా సాగుతుందని తెలుస్తోంది.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# మంగపేటలో మండల పరిషత్ భవనానికి శంకుస్థాపన

- రూ.1.50 కోట్లతో నూతన భవన నిర్మాణం
- ప్రజలకు మెరుగైన పరిపాలనా సేవలే లక్ష్యం
- పాల్గొన్న మంత్రి సీతక్క, కలెక్టర్ హేమంత్ సహదేవరావు

**ములుగు, జూన్ 25 (తెలంగాణ ముచ్చట్లు):** మంగపేట మండల కేంద్రంలో నూతన మండల ప్రజా పరిషత్ కార్యాలయ భవన నిర్మాణ పనులకు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క శంకుస్థాపన చేశారు. జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావుతో కలిసి భవన నిర్మాణ పనులను ప్రారంభించారు.
పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో కార్యాలయ భవనాల నిధులతో రూ.1.50 కోట్ల వ్యయంతో ఈ భవనాన్ని నిర్మించనున్నారు. ఆధునిక వసతులతో కూడిన ఈ భవనం ద్వారా మండల స్థాయి పరిపాలనా సేవలు మరింత సమర్థంగా అందుబాటులోకి రానున్నాయి. ప్రజలకు ఒకేచోట వివిధ సేవలు అందేలా ప్రణాళిక రూపొందించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. పరిపాలనా వ్యవస్థను ప్రజలకు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా కొత్త కార్యాలయ భవనాల నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. గ్రామీణాభివృద్ధి కార్యక్రమాల అమలులో ఇలాంటి మౌలిక వసతులు కీలకమని పేర్కొన్నారు.
జిల్లా కలెక్టర్ హేమంత్ సహదేవరావు మాట్లాడుతూ భవన నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని అన్ని సౌకర్యాలతో భవనాన్ని నిర్మించాలని సూచించారు.
కార్యక్రమంలో ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి లెనిన్ వత్సల్ టోప్పో, గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు బానోతు రవిచందర్, మార్కెట్ కమిటీ అధ్యక్షురాలు రేగ కళ్యాణి, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. నూతన భవనం నిర్మాణంతో మండల పరిపాలనా వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని అభిప్రాయపడ్డారు. భవనం పూర్తయిన తర్వాత ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత వేగంగా, సమర్థవంతంగా అందే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలుకు ఇది ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. మంగపేట మండల అభివృద్ధిలో ఈ భవనం మరో కీలక మైలురాయిగా నిలవనుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# ఖమ్మంలో నేషనల్ మార్ట్ సూపర్ మార్కెట్ ప్రారంభం

- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చేతుల మీదుగా ప్రారంభోత్సవం
- వ్యాపార విస్తరణతో ఉపాధి అవకాశాలు పెరుగుతాయని వ్యాఖ్య
- నగర ఆర్థికాభివృద్ధికి కొత్త ఊపు వస్తుందన్న ఆశాభావం

**ఖమ్మం, జూన్ 25 (తెలంగాణ ముచ్చట్లు):** ఖమ్మం నగరంలో నూతనంగా ఏర్పాటు చేసిన నేషనల్ మార్ట్ సూపర్ మార్కెట్‌ను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి, సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, డీసీసీ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. సూపర్ మార్కెట్ ప్రారంభోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్థానిక ప్రజలు, వ్యాపారవేత్తలు, నాయకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. నూతన వాణిజ్య సంస్థ ప్రారంభం పట్ల హర్షం వ్యక్తం చేశారు.
ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ వ్యాపార, వాణిజ్య రంగాల విస్తరణతో స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరుగుతాయని అన్నారు. కొత్త వ్యాపార సంస్థలు ఏర్పడడం ద్వారా యువతకు ఉద్యోగ అవకాశాలు లభించడంతో పాటు ప్రాంతీయ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని పేర్కొన్నారు. ఖమ్మం నగరం వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో కొత్త పెట్టుబడులు, వాణిజ్య సంస్థలు రావడం సానుకూల పరిణామమని తెలిపారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడంతో పాటు స్థానిక వ్యాపార కార్యకలాపాలకు కూడా ఇవి దోహదపడతాయని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం పరిశ్రమలు, వాణిజ్య రంగ అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తోందని భట్టి విక్రమార్క తెలిపారు. పెట్టుబడులను ఆకర్షించడం ద్వారా ఆర్థికాభివృద్ధి, ఉపాధి కల్పన లక్ష్యంగా పనిచేస్తోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు నేషనల్ మార్ట్ యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సంస్థ ఖమ్మం నగర అభివృద్ధికి తోడ్పాటునందించాలని ఆకాంక్షించారు. స్థానిక ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలని కోరారు.





# బొగ్గు ఉత్పత్తి పెంపుపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సమీక్ష

- ఇంధన భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశం
- బొగ్గు శాఖ ఉన్నతాధికారులతో సమావేశం
- సరఫరా వ్యవస్థ మరింత బలోపేతం చేయాలని సూచన

**న్యూఢిల్లీ, జూన్ 25 (తెలంగాణ ముచ్చట్లు):** కేంద్ర బొగ్గు శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి గురువారం న్యూఢిల్లీలో బొగ్గు శాఖ ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. బొగ్గు ఉత్పత్తి, సరఫరా, కొనసాగుతున్న కార్యక్రమాలు, భవిష్యత్ కార్యాచరణపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు.
దేశానికి నిరంతర ఇంధన సరఫరా అందించేందుకు బొగ్గు ఉత్పత్తి సామర్థ్యాన్ని మరింత పెంచాల్సిన అవసరం ఉందని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలకు అవసరమైన బొగ్గు సకాలంలో అందేలా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. బొగ్గు గనుల్లో ఉత్పత్తి పురోగతి, నిల్వలు, రవాణా వ్యవస్థపై అధికారులు వివరాలు సమర్పించారు.




ఉత్పత్తి నుంచి పంపిణీ వరకు అన్ని దశల్లో సమర్థవంతమైన నిర్వహణ ఉండేలా చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగంతో బొగ్గు రంగంలో ఉత్పాదకతను పెంచాలని సమావేశంలో చర్చించారు. గనుల నిర్వహణలో సామర్థ్య పెంపు, భద్రతా ప్రమాణాల అమలు, పర్యావరణ పరిరక్షణ అంశాలపై కూడా దృష్టి సారించారు.
దేశంలో పెరుగుతున్న ఇంధన అవసరాలను దృష్టిలో ఉంచుకుని బొగ్గు రంగాన్ని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని కిషన్ రెడ్డి తెలిపారు. విద్యుత్ రంగానికి ఎలాంటి అంతరాయం కలగకుండా బొగ్గు సరఫరా వ్యవస్థను పటిష్ఠంగా ఉంచాలని సూచించారు. దేశ ఇంధన భద్రత సాధనలో బొగ్గు రంగం కీలక పాత్ర పోషిస్తోందని మంత్రి పేర్కొన్నారు. ఉత్పత్తి, సరఫరా, నిర్వహణలో మెరుగైన ఫలితాలు సాధించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.



# హరీష్ రావు అండతో యువకుడికి కొత్త జీవితం

- కృత్రిమ కాలు అందించి కుటుంబానికి భరోసా
- ప్రమాదంలో కాలు కోల్పోయిన రంజిత్‌కు సాయం
- ఇచ్చిన మాట నిలబెట్టుకున్న హరీష్ రావు

**సిద్దిపేట, జూన్ 25 (తెలంగాణ ముచ్చట్లు):** సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం పెద్దకోడూరు గ్రామానికి చెందిన యువకుడు రంజిత్‌కు బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు అండగా నిలిచారు. ప్రమాదంలో కాలు తీవ్రంగా దెబ్బతిని మంచానికే పరిమితమైన రంజిత్‌కు కృత్రిమ కాలు ఏర్పాటు చేసి కొత్త జీవితాన్ని ప్రసాదించారు. ఈ సహాయం ద్వారా ఆ కుటుంబానికి ఆర్థిక భరోసా కూడా కల్పించారు. వరుకొలు మల్లేశం, సాలవ్వ దంపతుల కుమారుడైన 20 ఏళ్ల రంజిత్ కొద్ది రోజుల క్రితం జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. ప్రమాదం కారణంగా కాలు దెబ్బతినడంతో సాధారణ జీవితానికి దూరమయ్యాడు. చదువులు, భవిష్యత్తుపై ఆందోళన చెందుతూ తీవ్ర మానసిక వేదనకు గురయ్యాడు. కృత్రిమ కాలు అమర్చితేనే తిరిగి నడిచే అవకాశం ఉంటుందని వైద్యులు సూచించారు. అయితే దానికి సుమారు ఎనిమిది లక్షల రూపాయల ఖర్చు అవుతుందని చెప్పడంతో కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. కూలీ పని చేసే తండ్రి, బీడీలు చేసే తల్లి అంత పెద్ద మొత్తాన్ని సమకూర్చలేని పరిస్థితిలో ఉన్నారు.
ఈ విషయం తెలుసుకున్న స్థానిక సర్పంచ్ సామల సునీత మధు కుటుంబ సభ్యులను హరీష్ రావు వద్దకు తీసుకెళ్లారు. సమస్యను పూర్తిగా విన్న హరీష్ రావు వెంటనే స్పందించి కుటుంబానికి ధైర్యం చెప్పారు. ఆర్థిక ఇబ్బందుల గురించి ఆలోచించవద్దని, కృత్రిమ కాలు ఏర్పాటు చేసే బాధ్యత తనదేనని హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం కేవలం 15 రోజుల్లోనే అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేసి సుమారు ఐదు లక్షల రూపాయల వ్యయంతో కృత్రిమ కాలును అందించారు. దీంతో రంజిత్ తిరిగి సాధారణ జీవితంలోకి అడుగుపెట్టే అవకాశం లభించింది. కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేస్తూ హరీష్ రావుకు కృతజ్ఞతలు తెలిపారు.
ఈ సందర్భంగా రంజిత్ మాట్లాడుతూ హరీష్ అన్న తనకు కొత్త జీవితాన్ని ఇచ్చారని, జీవితాంతం ఆయనకు రుణపడి ఉంటానని అన్నారు. తమ కుమారుడి భవిష్యత్తుపై ఆశలు కోల్పోయిన సమయంలో అండగా నిలిచిన హరీష్ రావును ఎప్పటికీ మరువలేమని తల్లిదండ్రులు భావోద్వేగంగా పేర్కొన్నారు. ఈ ఘటన స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.

# పేదలకు సమీపంలోనే ఇందిరమ్మ ఇండ్లు: పొంగులేటి

- క్యూర్ పరిధిలో పది అంతస్తుల భవనాల్లో నిర్మాణాలు
- జూన్ 28లోగా స్థలాల ఖరారు
- జూలై తొలి వారంలో బ్రోచర్ విడుదల

**హైదరాబాద్, జూన్ 25 (తెలంగాణ ముచ్చట్లు):** పేదల సొంతింటి కలను సాకారం చేయడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. పేదల జీవనోపాధి, పిల్లల విద్య, కుటుంబ జీవన విధానానికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వారు ప్రస్తుతం నివసిస్తున్న ప్రాంతాలకు సమీపంలోనే క్యూర్ పరిధిలో పది అంతస్తుల భవనాల్లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం చేపడుతున్నామని వెల్లడించారు.
గురువారం సచివాలయంలో తన కార్యాలయంలో క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇండ్ల



నిర్మాణం, ఆర్డీఓ, తహసీల్దార్ కార్యాలయాల శాశ్వత భవనాల నిర్మాణం, భద్రాచలం దేవస్థానం అభివృద్ధి అంశాలపై అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా పేదలకు గౌరవప్రదమైన నివాస వసతి కల్పించడంపై ప్రభుత్వం దృష్టి సారించిందని తెలిపారు.
ఈ ఏడాది క్యూర్ పరిధిలో లక్ష ఇళ్ల నిర్మాణాన్ని లక్ష్యంగా పెట్టుకున్నామని మంత్రి పేర్కొన్నారు. తొలి విడతలో ప్రయోగాత్మకంగా ప్రతి నియోజకవర్గంలో 500 చొప్పున ఇళ్ల నిర్మాణం చేపట్టనున్నట్లు వెల్లడించారు. క్యూర్ పరిధిలోని 26 నియోజకవర్గాల్లో ఇప్పటికే దాదాపు 20 ప్రాంతాల్లో స్థలాలను గుర్తించినట్లు తెలిపారు. మిగిలిన ప్రాంతాల్లో స్థలాల గుర్తింపు ప్రక్రియను వేగవంతం చేసి ఈ నెల 28వ తేదీలోగా అన్ని లొకేషన్లను ఖరారు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతి స్థలానికి సంబంధించిన నమూనాలు, డిజైన్లు, నిర్మాణ ప్రణాళికలు కూడా అదే గడువులో సిద్ధం చేయాలని సూచించారు.
ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించిన విధివిధానాలు, అర్హతలు, దరఖాస్తు ప్రక్రియ వివరాలతో కూడిన బ్రోచర్‌ను జూలై మొదటి వారంలో విడుదల చేస్తామని మంత్రి వెల్లడించారు. ప్రభుత్వానికి చెందిన విలువైన భూముల్లో ఈ నిర్మాణాలు చేపడుతున్నామని, మహిళలకు అవిభాజ్య వాటా కల్పిస్తూ ఆ భాగాన్ని వారి పేర్లపై నమోదు చేసే విధానాన్ని అమలు చేస్తామని స్పష్టం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా గృహ నిర్మాణ సంస్థ ఆధ్వర్యంలో ఒకే నమూనాలో ఆర్డీఓ, తహసీల్దార్ కార్యాలయాలకు శాశ్వత భవనాలు నిర్మిస్తున్నట్లు మంత్రి తెలిపారు. జిల్లా కలెక్టర్లతో సమన్వయం చేసుకొని పనులు త్వరగా ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో రెవెన్యూ శాఖ కార్యదర్శి డి.ఎస్. లోకేశ్ కుమార్, గృహ నిర్మాణ శాఖ కార్యదర్శి వి.పి. గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ మోసాలకు బ్రేక్.. 5 రోజుల్లో తప్పనిసరి రీఫండ్‌కి ఆర్‌బీఐ ఆదేశాలు

**ముంబై, జూన్ 25 (తెలంగాణ ముచ్చట్లు):** డిజిటల్ చెల్లింపులు, క్రెడిట్ కార్డు వినియోగం వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో సైబర్ మోసాలను అరికట్టేందుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) కీలక నిర్ణయం తీసుకుంది. కొత్త మార్గదర్శకాల ప్రకారం, డిజిటల్ మోసం లేదా అనధికారిక లావాదేవీలకు గురైన ఖాతాదారులకు బ్యాంకులు గరిష్ఠంగా ఐదు పనిదినాల్లోపే రీఫండ్ చేయాల్సి ఉంటుంది.
ఈ రీఫండ్‌ను “షాడో రివర్సల్” లేదా “తాత్కాలిక క్రెడిట్” రూపంలో బాధితుడి ఖాతా లేదా క్రెడిట్ కార్డులో వెంటనే జమ చేయాలని ఆర్‌బీఐ స్పష్టం చేసింది. బ్యాంకు విచారణ పూర్తయ్యే వరకు ఖాతాదారులు తమ సొమ్ము కోసం వేచి ఉండాల్సిన అవసరం లేకుండా ఈ విధానం తీసుకొచ్చినట్లు పేర్కొంది.
ఇదే కాకుండా, ట్రాన్సాక్షన్ అలర్ట్స్ వ్యవస్థలో కూడా ఆర్‌బీఐ కీలక మార్పులు చేసింది. ఇకపై క్రెడిట్ కార్డు లేదా డిజిటల్ చెల్లింపుల ద్వారా రూ.500 లేదా అంతకంటే ఎక్కువ విలువైన ప్రతి లావాదేవీకి వెంటనే మొబైల్ ఫోన్ మరియు ఈమెయిల్‌కు అలర్ట్ మెసేజ్ రావడం తప్పనిసరి కానుంది.
ఈ నూతన నిబంధనలు 2027 జనవరి 1 నుంచి దేశవ్యాప్తంగా అమల్లోకి రానున్నాయి. ఈ మార్పులతో అనధికారిక లావాదేవీలను త్వరగా గుర్తించడం, కార్డులను వెంటనే బ్లాక్ చేయడం సాధ్యమవుతుందని అధికారులు భావిస్తున్నారు.
ఆర్థిక నిపుణుల అభిప్రాయం ప్రకారం, ఈ నిర్ణయం బ్యాంకింగ్ వ్యవస్థపై ప్రజల నమ్మకాన్ని పెంచడమే కాకుండా సైబర్ నేరగాళ్లకు గట్టి అడ్డుకట్ట వేస్తుందని భావిస్తున్నారు.




Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in